జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



# నిర్మాణరంగాన్ని నిలబెడతాం


- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం
- అందుకోసమే ఉచిత ఇసుక పాలసీ
- రియల్ ఎస్టేట్ బాగున్న చోటే సంపద సృష్టి
- గత ప్రభుత్వంలో నిర్మాణరంగం అడ్రస్ లేదు
- టీఆర్ బాండ్ల దోషుల్ని శిక్షిస్తాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించిన సీఎం

గుంటూరు,మహానాడు: 'బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకెళుతున్నాం. ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఉన్నాం. అందుకే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమానికి వచ్చా. రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మళ్లీ ఊపు రావాలని కోరుకుంటున్నాను. నిర్మాణం రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చేవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరిస్తాం'అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. అనంతరం బిల్డర్లను ఉద్దేశించి మాట్లాడారు.

**ఎటు చూసినా విధ్వంసం... అంధకారమే కనబడింది**

'7 నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశాం. అన్ని వ్యవస్థలు పతనమయ్యాయి. మిగతా.. 6లో

# కొండపై 'సారీ' సమరం!



- ఈఓ, ఏఈఓ, చైర్మన్ క్షమాపణ చెప్పాల్సిందేనన్న ఉప ముఖ్యమంత్రి పవన్
- వేరే దారిలేదని పవన్ స్పష్టీకరణ
- నాకు లేని నామోషీ వారికెందుకన్న ప్రశ్న
- కూటమి వచ్చినందుకే వారికి ఆ పదవులొచ్చాయన్న వ్యాఖ్య
- డీఎస్పీ సరిగ్గా పనిచేస్తే ఎస్పీ బలయ్యేవాడు కదా అని ప్రశ్న
- క్షమాపణ చెబితే ప్రాణాలు తిరిగొస్తాయా అన్న చైర్మన్ నాయుడు
- క్షమాపణ చెప్పడంలో తప్పులేదంటూనే మెలిక
- ఎవరేదో మాట్లాడితే వాటికి స్పందించాల్సిన పనిలేదని వ్యాఖ్య
- నాయుడు వ్యాఖ్యలపై సోషల్‌మీడియాలో ట్రోలింగ్
- పవన్‌నుద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశారంటూ కామెంట్లు
- దానితో దిద్దుబాటుకు దిగిన నాయుడు
- ఆ వ్యాఖ్యలు పవన్‌నుద్దేశించి చేసినవి కావని స్పష్టీకరణ
- క్షమాపణపై పెదవి విప్పని శ్యామలరావు, వెంకయ్యచౌదరి
- వారిద్దరి నిర్లక్ష్యంపై జనసైనికుల గుస్సా
- 'కొండ'పై మాటల కల్లోలం

**( మార్తి సుబ్రహ్మణ్యం)**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు తర్వాత నెంబర్‌టూ. ఆయన ఫొటో కూడా సీఎం చంద్రబాబునాయుడు పక్కనే అన్ని శాఖల కార్యాలయాల్లోనూ కనిపిస్తాయి. మంత్రులందరిలోనూ ఆయన ప్రొటోకాల్ ప్రత్యేకం. నామినేటెడ్ పదవుల్లోనూ జనసేనాని పార్టీదే అ'ద్వితీయ' ప్రాధాన్యం. మరి అంత 'పవర్' ఫుల్ పవన్‌నుద్దేశించి.. 'ఎవరో ఏదో మాట్లాడారని అందరి మాటలకు స్పందించాల్సిన పనిలేదని', ఒక చైర్మన్ తేలిగ్గా మాట్లాడితే ఎలా ఉంటుంది? అది పెను సంచలనమయిపోదూ? చంద్రబాబు అంతటివాడే పవన్ దూకుడుకు మౌనంగా ఉంటే, ఒక ఆలయ కమిటీ చైర్మన్ మాత్రం లెక్కలేనట్లు మాట్లాడితే అది జనసైనికులకు కోపం తెప్పించదూ? అది సోషల్‌మీడియాలో సంచలనమయిపోదూ? దానిపై సోషల్‌మీడియా సోల్జర్స్ కామెంట్లతో చెలరేగిపోరూ?! ప్రత్యర్థి పార్టీ సోషల్‌మీడియా లడ్డూలాంటి ఈ అవకాశం వాడుకుని పొగపెట్టేయవూ?.. యస్. ఇప్పుడు తిరుమల కొండపై సరిగ్గా అదే జరిగింది. ఆ వ్యాఖ్యలు చేసిందెవరో కాదు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. ఇక కొండ పైకి వెళదాం.



తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం ఏర్పాటు చేసిన సెంటర్లలో తొక్కిసలాట జరిగి, ఆరుగురు మృతి చెందిన విషాదం తెలిసిందే. ఆ వార్త తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు తిరుపతి వెళ్లి మృతుల కుటుంబసభ్యులతో పాటు, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. నష్టపరిహారం ప్రకటించారు.

బాబు అక్కడ పరామర్శలో ఉన్న సమయంలోనే జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటాహుటిన తిరుపతి వెళ్లి.. బాధితులను పరామర్శించారు. ఒకరకంగా చెప్పాలంటే సీఎం-డిప్యూటీ సీఎం పర్యటనలు సమాంతరంగానే సాగాయి.

ముందు ప్రెస్‌మీట్ నిర్వహించిన సీఎం చంద్రబాబు నాయుడు.సంఘటనకు బాధ్యులుగా గుర్తించి ఎస్పీ, జేఈఓ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌పై వేటు వేసి, డీఎస్పీని సస్పెండ్ చేశారు. న్యాయవిచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఈఓ, జేఈఓపై బాబు తన సహజశైలిలో నిప్పులు కురిపించారు. చంద్రబాబు ప్రెస్‌మీట్ తర్వాత, ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్ నేరుగా.. చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెం య్యచౌదరి నిర్లక్ష్యంపై విరుచుకుపడ్డారు. ఈ ముగ్గురే జరిగిన ఘటనకు బాధ్యత వహించాలని స్పష్టం మిగతా.. 2లో

## భగ్గుమన్న 'బోర్డు'



2 లో



# గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్

- మూడు కేటగిరీలుగా సచివాలయాల విభజన
- కనీసం 2500 మందికి ఒక గ్రామ, వార్డు సచివాలయం
- మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీలుగా ఉద్యోగులు
- గ్రామాల్లో టెక్నాలజీ ప్రమోషన్‌కు ఆస్పిరేషనల్ సెక్రటరీలు
- కొత్త ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- తన ఫోటో లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశం

అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ద్వారా వారి నుంచి మంచి సేవలు పొందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొన్ని చోట్ల ఎక్కువగా, కొన్ని చోట్ల తక్కువగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఉన్నారు. రేషనలైజేషన్ ద్వారా వీటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మిగతా.. 2లో

# చైనా తరహాలో క్లస్టర్లు

- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్
- అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు
- ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదు
- కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలి
- సీఐఐ ప్రతినిధుల ముఖాముఖిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు: హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. చంద్ర మండలానికి వెళ్తున్నాం. కానీ భూమిపైన ఎలా ఉండాలో మాత్రం మిగతా.. 2లో





# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- లక్ష్యసాధనకు అందరి సహకారం కావాలి
- 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం
- పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు
- దిశానిర్దేశం చేసిన మంత్రుల ఉపసంఘం ఛైర్మన్ నారా లోకేష్

ఉండవల్లి,మహానాడు: కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయమని, సమన్వయ లోపం లేకుండా లక్ష్య సాధనకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రుల ఉపసంఘం ఛైర్మన్ నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీఎస్ కే.విజయానంద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా మేనిఫెస్టోను రూపొందించడం జరిగింది. అందులో తొలి హామీ ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పిన. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా మేనిఫెస్టోలో ఒక నెంబర్ పెట్టి.. ఇన్ని ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పలేదు. మేం చెప్పాం. దానికి కారణం నేను యువగళం పాదయాత్రలో భాగంగా గంగాధర నెల్లూరుకు వెళ్లినప్పుడు ఓ తల్లితో మాట్లాడటం జరిగింది. ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారని ఆ మహిళను అడిగినప్పుడు.. ఆమె ఒక్కటే చెప్పింది. భర్త తాగుబోతు చనిపోయాడు, కష్టపడి తన ఇద్దరు బిడ్డలను చదివించానని, వారిద్దరికి ఉద్యోగాలు కల్పించాలని కోరింది. కూటమి మేనిఫెస్టో మిగతా.. 2లో



03
వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీకి మంత్రి ఆదేశం



03
టీటీడీ చైర్మన్, ఈఓల జోలికి సీఎం ఎందుకు వెళ్లడం లేదు?



03
టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమే



04
భక్తి వ్యాపారానిదే పాపం!





## ప్రజల్ని ఓట్లు అడిగాను కాబట్టే.. తప్పు జరిగినప్పుడు
# బాధ్యతగా క్షమాపణ కోరా

- తిరుపతి దుర్ఘటన విషయంలో టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, పాలక మండలి సభ్యులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్షమాపణ చెప్పాలి
- గత ప్రభుత్వానిది స్కాముల్లో రికార్డు... కూటమి ప్రభుత్వానిది స్కీముల్లో రికార్డు
- పాడి రైతులు న్యూజిలాండ్ తరహాలో ప్రగతి సాధించాలి
- గత ప్రభుత్వంలో నాయకుల సొంత డెయిరీలను పెంచుకున్నారు
- అధికారులకు హనీమూన్ పీరియడ్ అయిపోయింది
- సొంత ఇష్టాలను పక్కన పెట్టి రాజ్యాంగబద్ధంగా ప్రజల కోసం పనిచేయండి
- పిఠాపురం నుంచే జిల్లాల పర్యటన ప్రారంభిస్తాను
- పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గోకులాలను ప్రారంభించి పిఠాపురం బహిరంగసభలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పిఠాపురం,మహానాడు: 'గత ప్రభుత్వం పాడి రైతును పట్టించుకున్న పాపాన పోలేదు. రాష్ట్రంలో ఎవరూ బాగుపడకూడదు.. ఎవరి దగ్గరా డబ్బులుండకూడదు అనే ఒకే ఒక సిద్ధాంతంతో లక్షలాది పాడిరైతుల పొట్టకొట్టే చర్యలు ఆనాటి పాలకులు చేపట్టారు. సహకార డెయిరీలను గాలికొదిలేసి, సొంత డెయిరీలను అభివృద్ధి చేసుకోవడంపైన దృష్టి పెట్టార'ని మిగతా.. 7లో



# క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే

- అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దు
- భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలి
- కొంతమంది ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారు
- ఇంచార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలి
- ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలి
- జనవరి 26 తరువాత నేను ఆకస్మిక తనిఖీలు చేస్తా
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు: ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లే. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారు. మిగతా.. 6లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 ||



## చైనా తరహాలో క్లస్టర్లు



మొదటి పేజీ తరువాయి..

తెలుసుకోలేకపోతున్నాం. కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నాం. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించాం. మహిళా సంఘాలతో సోలార్ పవర్ ప్లేన్లు ఏర్పాటు చేయిస్తున్నాం. 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయం కునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశాం.

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ ఛార్జీలు ను పెంచాం. మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాం. మచిలీపట్నం పోర్ట్ ను అనుసంధానం చేస్తు రోడ్డు, రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీ ని కోరాం. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తాం. తెలంగాణలో ప్రతి యేడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదు. టాటా గ్రూప్ తో కలిసి 2400 కోట్లతో రాష్ట్రంలోని ఐటీఐ లను ఏటీసీలుగా మారుస్తున్నాం. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా ఛైర్మన్ గా బోర్డు ఏర్పాటు చేశాం. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలి.

స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే 50 కోసం ప్రణాళికలు రచిస్తున్నాం.. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి నన్ను కలవచ్చు. మా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది.

## గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి.

వీటిలో 1,27,175 మంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉండేలా ఈ విభాగాన్ని డిజైన్ చేయగా... చాలా ప్రాంతాల్లో తక్కువ మంది సిబ్బందితో కార్యకలాపాలు నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల 4 నుంచి ఆరుగురితో సచివాలయాలు పనిచేస్తున్నాయి. రేషనలైజేషన్‌లో భాగంగా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన.

మల్టీపర్పస్ ఫంక్షనరీస్ విభాగంలోకి విలేజ్ సెక్రటేరియట్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ వస్తారు. అలాగే వార్డు సెక్రటేరియట్‌లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు.

టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలోకి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, వెటర్నరీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలో వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. 2500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీపర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఆరుగురు ఉంటారు. 2500 నుంచి 3500 మంది జనాభాకు ముగ్గురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఏడుగురు ఉంటారు. 3501 నుంచి ఆపై జనాభాకు నలుగురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఎనిమిది మంది ఉంటారు.

ఈ విధంగా రేషనలైజేషన్ చేస్తే 2500లోపు జనాభా కలిగిన ప్రాంతంలో ఆరుగురు సిబ్బందితో 3,562 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 2500 నుంచి 3500 మంది జనాభా కలిగిన ప్రాంతంలో ఏడుగురు సిబ్బందితో 5,388 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 3500 పైగా జనాభా కలిగిన ప్రాంతంలో 8 మంది సిబ్బందితో 6054 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. మొత్తం 15,004 గ్రామ వార్డు సచివాలయాలు ఉంటాయి. ఈ అంశాలను సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ ఒకరిని ఆస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సూచించారు. వీరి ద్వారా ఎఐ, డ్రోన్ వంటి కొత్త టెక్నాలజీని గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సెక్రటరీ ద్వారా గ్రామాల్లో, వార్డుల్లో టెక్నాలజీ పరంగా సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చెయ్యాలని సూచించారు.

కనీసం 2500 జనాభాకు లేదా 5 కి.మీ పరిధిలో ఒక సెక్రటేరియట్ ఉండాలని సిఎం సూచించారు. ఏజెన్సీలలో అవసరం అయితే అదనంగా సచివాలయాలు పెంచాలని సూచించారు. గతంలో ప్రతిపాదించిన విధానం ప్రకారం మొత్తం 1,61,000 సచివాలయ ఉద్యోగులు ఉండాలి. కానీ ప్రస్తుతం 1,27,000 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కొత్తవిధానం వల్ల తక్కువ సంఖ్యతో ఎక్కువ సేవలు పొందే అవకాశం ఉంది..

ఉన్నవారిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించనున్నారు. కొత్త విధానం అమలు పరిస్తే 15 వేల మంది సెక్రటేరియట్ స్టాఫ్ అదనంగా ఉంటారు. వీళ్లలో సాంకేతికంగా అవగాహన ఉన్న వారిని శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సీఎం సూచించారు. అదే విధంగా ప్రజల సమాచారం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

సమాచారం లేని ప్రజలకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకునే పక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాలు రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయాలుగా పనిచేయాలని సిఎం సూచించారు. సచివాలయాల పనితీరు అంచనా వేసి వారికి తగిన విధంగా బహుమతి ఇవ్వాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి/వార్డు పరిపాలనా కార్యదర్శి సచివాలయ విభాగానికి అధిపతిగా ఉంటారు. సచివాలయాలు నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి, విలువ జోడింపు వంటి వాటికి కేంద్రంగా ఉండాలన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ద్వారా కార్యనిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించాలన్నారు. జనవరి 20, 2025 నాటికి గృహాలన్నీ జియో-ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.

సచివాలయాల ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లపై ముఖ్యమంత్రి ఫోటోలు ముద్రించవద్దని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు. పిల్లలందరికీ ఆధార్ జారీ ప్రక్రియ ఫిబ్రవరి 15, 2025 నాటికి పూర్తి చెయ్యాలన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వ్యక్తుల గురించి సర్వే చేయాలని సూచించారు.

## కొండపై 'సారీ' సమరం!

మొదటి పేజీ తరువాయి..

చేశారు. జరిగిన విషాదానికి తాను క్షమాపణ చెబుతున్నట్లు వినమ్రంగా ప్రకటించారు. ఆ ముగ్గురు కూడా క్షమాపణ చెప్పి తీరాలని నిర్మొహమాటంగా చెప్పారు. చైర్మన్-ఈఓ మధ్య గ్యాప్ ఉన్నట్లు వెల్లడించారు. కొండపై అధికారులు సామాన్య భక్తులను గాలికొదిలి, వీఐపీల సేవలో మునుగుతున్నారంటూ కన్నెర్ర చేశారు.

తాజాగా తన పిఠాపురం నియోజకవర్గానికి వెళ్లిన పవన్.. అక్కడి ప్రభుత్వ వేదికపై కూడా తిరుపతి అంశాన్ని ప్రస్తావించి, చైర్మన్-ఈఓ-అడిషనల్ ఈఓపై అస్త్రాలు సంధించి, మళ్లీ ఇరికించారు. 'నేనే క్షమాపణ చెప్పా. నాకు లేని నామోషీ వారికెందుకు? నేను ఓట్లు అడిగిన ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది. కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టే నాయుడు చైర్మన్, శ్యామలరావు ఈఓ, వెంకయ్యచౌదరి అడిషనల్ ఈఓ పదవులు వచ్చాయి. కాబట్టి ఆ ముగ్గురు క్షమాపణ చెప్పాల్సిందే. వారికి వేరే దారిలేద'నని కుండబద్దలు కొట్టిన వైనం, మరోసారి సంచలనం సృష్టించింది.

అటు పవన్ వ్యాఖ్యలు సైతం టీవీ చానెళ్లు, సోషల్‌మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. దీన్నిబట్టి.. ఈఓ, జేఈఓ, చైర్మన్ క్షమాపణల విషయంలో పవన్ చాలా పట్టుదలతో ఉన్నట్లు స్పష్టమయింది. తానే క్షమాపణ చెప్పిన తర్వాత వారెందుకు చెప్పరన్న దానిపై ఆయన పట్టుదలతో ఉన్నట్లు పవన్ వ్యాఖ్యలు చెప్పకనే చెప్పినట్టయింది.

చైర్మన్ నాయుడు వ్యాఖ్యలపై జనసైనికులు కన్నెర్ర చేశారు. వాటిపై మరికొందరు పోస్టింగులు పెట్టారు. చివరకు అది అటు తిరిగి.. పవన్ కల్యాణంటే చైర్మన్ లెక్కలేకుండా మాట్లాడారనేంత వరకూ వెళ్లింది. 'పవన్‌ను ఎవరో అంటారా? పవన్ ఎవరో నాయుడుకు తెలియదా? పవన్ స్వయంగా క్షమాపణ చెబితే చైర్మన్, ఈఓ, ఏఈఓ క్షమాపణ చెప్పడానికి ఏంటి ఇగో' అంటూ విమర్శల వర్షం కురిపించారు.

ఈ నేపథ్యంలో దిద్దుబాటుకు దిగిన నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. "నా వ్యాఖ్యలను పవన్‌కు ఆపాదించటం భావ్యం కాదు. అవి ఆయననుద్దేశించి చేసినవి కాదు. ఘటన జరిగిన వెంటనే నేను భక్తులకు, మృతుల కుటుంబాలకు క్షమాపణ చెప్పా. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల కమిటీ కంటే ముందుగానే బోర్డు క్షమాపణ చెప్పింది. క్షమాపణల గురించి అవసరమైన అసత్యాలు మానుకోవాలి"అని ఒక ప్రకటన విడుదల చేయాల్సి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగి, ఈ వ్యవహారానికి తెరదించకపోతే అది కూటమిపై ప్రభావం పడుతుందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాతే నాయుడు ప్రకటన విడుదల చేశారంటున్నారు.

అయితే.. భక్తులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది ఒక్క పవన్ మాత్రమే. జగన్ సహా వైసీపీ నేతలంతా చైర్మన్, ఈఓ, ఏఈఓలపై కేసు పెట్టాలని మాత్రమే డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్ నాయుడు తాను పవన్‌ను ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదన్న వివరణ జనసైనికులకు సంతృప్తి కలిగించనట్లు కనిపిస్తోంది. ప్రెస్‌మీట్‌లో జర్నలిస్టులు క్షమాపణల విషయాన్ని ప్రస్తావించగా ఎవరో ఏదో మాట్లాడితే స్పందించాల్సిన అవసరం నాకు లేదని' నాయుడు వ్యాఖ్యానించడం గమనార్హం. సరే.. పవన్ కల్యాణ్ డిమాండ్ తర్వాత చైర్మన్ నాయుడు స్పందించడం వరకూ బాగానే ఉన్నప్పటికీ.. మిగిలిన వారిద్దరూ ఇప్పటిదాకా, పెదవి విప్పకపోవడంపై జనసైనికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి మాత్రం క్షమాపణ విషయంలో మౌనంగా ఉండటాన్ని, జనసైనికులు సహించలేకపోతున్నారు. ప్రెస్‌మీట్‌లో నాయుడు పక్కనే ఉన్న వారిద్దరూ, చైర్మన్ ప్రసంగం తర్వాత మాట్లాడి.. తాము కూడా క్షమాపణ చెబుతారని చాలామంది ఊహించారు. కానీ వారు అసలు పవన్ డిమాండ్‌ను పట్టించుకోక పోవడమే విచిత్రం. దానినే ఇప్పుడు జనసైనికులు ప్రతిష్ఠగా తీసుకుం టున్నట్లు కనిపిస్తోంది. ఈ వ్యవహారం చూస్తుంటే. వారిద్దరూ క్షమాపణలు చెప్పేంత వరకూ.. అటు పవన్ కల్యాణ్ కూడా, పట్టువిడిచే అవకాశం కనిపించడం లేదు. ఈరోజు పిఠాపురంలో ప్రభుత్వ కార్యక్రమంలోనే, దానికి సంబంధం లేని క్షమాపణ విషయాన్ని మరోసారి ప్రస్తావించా రంటే.. పవన్ క్షమాపణ వ్యవహారాన్ని ఎంత ప్రతిష్ఠగా తీసుకున్నారో అర్థమవుతుంది.

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

మొదటి పేజీ తరువాయి..

ఓ గదిలో కూర్చొని రూపొందించింది కాదు.. క్షేత్రస్థాయి అనుభవాలతో రూపొందించింది. అందులో భాగంగానే 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం కేబినెట్ సబ్ కమిటీని వేయడం జరిగింది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలి. ప్రతి 15 రోజులకోసారి కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరుగుతుంది. నెలలో ఒకసారి ముఖ్యమంత్రి గారితో సమావేశం ఏర్పాటుచేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనను ట్రాక్ చేయాల్సిన అవసరం ఉంది.

### ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి

గడచిన ఐదేళ్లలో ఏం జరిగిందో అందరం చూశాం. చెప్పుకునే స్థాయిలో పెట్టుబడులు రాలేదు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక








మనకంటే ముందు వరుసలో ఉన్నాయి. పెట్టుబడులు తీసుకురావడం అంత సులభం కాదు.. చాలా సమయం పడుతుంది. మళ్లీ జగన్ రెడ్డి రాడనే గ్యారంటీని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీపీలను రద్దు చేశారు. పలు పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు. వారిని బతిమిలాడి రాష్ట్రానికి తీసుకువచ్చే పరిస్థితి. 1995-2004తో పోల్చుకుంటే రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలి.

పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, భూకేటాయింపులు త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలి. కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదాం. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరగాలి. ఉద్యోగాలు కల్పిస్తేనే జీతాలు ఇచ్చే పరిస్థితి. నెలకు రూ.4వేల కోట్ల లోటుతో రాష్ట్రం నడుస్తోంది. అందరం కలసి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేద్దాం.

### అచ్చేదిన్ రోజులు మనకు వచ్చాయి

కూటమిపాలనలో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ గా ఈడీబీ వ్యవహరిస్తుంది. లక్ష్య సాధనకు అందరి సహకారం కావాలి. ఒక్క పెట్టుబడి కూడా పొరుగు రాష్ట్రానికి వెళ్లడానికి వీలులేదు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించాలని, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగ, ఉపాధి కల్పనపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఐదేళ్లు రాష్ట్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అహర్నిశలు కృషిచేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారు. పర్యాటక రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. లక్ష్యసాధనకు తమవంతు బాధ్యత వహించాలని, శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ, పరిశ్రమలు, ఆరోగ్యం, హోమ్, మానవ వనరులు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ (I&I), జీఎస్ డబ్ల్యూఎస్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, కార్మిక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్ మెంట్, సెర్ప్, పర్యాటకం, రవాణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భగ్గుమన్న 'బోర్డు'

- వాడివేడిగా టీటీడీ బోర్డు భేటీ
- తిరుపతి విషాదానికి బాధ్యులెవరో తేల్చండి
- వారిపై చర్యలు తీసుకోవలసిందే
- ఈఓ, అడిషనల్ ఈఓపై సభ్యుల ప్రశ్నల వర్షం
- ఘటనకు మాదెలా బాధ్యత అవుతుంది?
- మీరు మాకేం బాధ్యత అప్పగించారు?
- అసలు మా బాధ్యత, మీ విధులేంటో తేల్చండి
- మేం టికెట్ల కోసం ఒత్తిడి చేస్తున్నామని ప్రచారం చేస్తారా?
- అసలు మీ కోటా ఎంతో తేల్చాల్సిందే
- మంత్రులు, సీఎంఓ కోటా కూడా చెప్పండి
- మేం టికెట్లు ఇవ్వమని మిమ్మల్ని అడిగామా?
- మమ్మల్ని బద్నామ్ చేస్తారా?
- వచ్చిపోయేకాడికి మాకు ఈ పదవులెందుకు?
- వచ్చే సమావేశానికల్లా హ్యాండ్‌బుక్ ఇస్తామన్న ఈఓ
- టీటీడీ బాసులపై సభ్యుల తిరుగుబాటు?

( మార్తి సుబ్రహ్మణ్యం)

మూడవ సమావేశం తర్వాత టీటీడీ బోర్డు సభ్యులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తిరుపతి విషాదానికి బాధ్యులెవరో తేల్చాల్సిందేనని మూకుమ్మడిగా గళమెత్తారు. మీ వైఫల్యం వల్ల చంద్రబాబు-మోదీ-పవన్ కల్యాణ్ బద్నామ్ అవుతున్నారని విరుచుకుపడ్డారు. తమకెలాంటి బాధ్యతలు అప్పగించకుండా, ఆ ఘటనకు తామెలా బాధ్యులమవుతామని ప్రశ్నించారు. తమను నిమిత్తమాత్రులను చేస్తే సహించేది లేదని కన్నెర్ర చేశారు. మేమంతా ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నత హోదాల నుంచి వచ్చినవారమేనని తెగేసి చెప్పారు. నెలకోసారి వచ్చిపోయేకాడికి మాకు ఈ పదవులు ఎందుకు? అని నిరసన స్వరం వినిపించారు. అసలు మీ అధికారాలేంటి? మా అధికారాలేంటో వచ్చే సమావేశంలో తేల్చాలన్నారు. మీ కోటాకింద ఎన్ని టికెట్లు జారీ చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దానితో వచ్చే సమావేశానికల్లా మీ విధులు-అధికారాలకు సంబంధించిన హ్యాండ్‌బుక్ ఇస్తామని, ఎవరి బాధ్యతలేమిటో స్పష్టం చేస్తామని ఈఓ, అడిషనల్ ఈఓ చెప్పాల్సి వచ్చింది. ఇదీ.. తాజాగా జరిగిన టీటీడీ బోర్డు భేటీ ముచ్చట్లు.

టీటీడీ బోర్డు సమావేశం వాడివేడిగా జరిగింది. రెండు సమావేశాల్లో మౌనంగా ఉన్న సభ్యులు.. తిరుపతి ఘటన తర్వాత అందివచ్చిన అవకాశంతో, అధికారులపై మూకుమ్మడి ఎదురుదాడి చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తమను నిమిత్తమాత్రులను చేసి, తమపై పెత్తనం చేస్తున్న ఈఓ, అడిషనల్ ఈఓ వైఖరిపై సభ్యులు విరుచుకుపడ్డారు.

మేమేమీ అల్లాటప్పావాళ్లం కాదు. మేమూ ఎమ్మెల్యే, ఇతర పదవులు చేసినవాళ్లమే. మమ్మల్ని తక్కువ చేసి చూస్తే సహించేదిలేదని దాదాపు హెచ్చరించినంత పనిచేశారు. దానితో నిర్ఘాంతపోవడం అధికారులవంతయింది. తిరుపతి ఘటనకు బాధ్యులెవరో తేల్చాల్సిందేనని పట్టుపట్టారు. న్యాయవిచారణజరిగినప్పటికీ, అంతర్గతంగా బాధ్యులెవరో తేల్చాలన్నారు.

మీ వైఫల్యం వల్ల చంద్రబాబునాయుడు-మోదీ-పవన్ ప్రతిష్ఠ దెబ్బతినే ప్రమాదం వచ్చింది. మీ వల్ల వాళ్లెందుకు బద్నామ్ కావాలి? అసలు మీరు మమ్మల్ని ఎందుకు విశ్వాసంలోకి తీసుకోవడం లేదు? మాకెందుకు సమాచారం ఇవ్వడం లేదు? ఘటన జరిగిన రోజున మాకేమైనా బాధ్యతలు అప్పగించారా? మాకు కూడా అక్కడ డ్యూటీలు ఎందుకు వేయలేదు? పిలిస్తే మేం కూడా సేవ చేసేవాళ్లం కదా అని ప్రశ్నల వర్షం కురిపించారు.



మేం టికెట్ల కోటా గురించి ఒత్తిళ్లు చేస్తున్నామని బయట ప్రచారం చేస్తున్నారు. మేం టికెట్లు ఇవ్వమని మిమ్మల్ని అడిగామా? మీరే కదా కోటా పెట్టింది? పోనీ దానినయినా అమలుచేస్తున్నారా? మా ఫోన్లకు స్పందించరు. రాత్రి వరకూ రేపటి దర్శనం ఇస్తారో లేదో చెప్పరు. మేం మీకు బానిసలం కాదు. మాకూ సొసైటీలో అంతో ఇంతో పేరుంది. మీరు మమల్ని అవమానిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అసలు మీ కోటా ఎంతో తేల్చండి. ఇప్పటిదాకా మీరు ఎన్ని టికెట్లు ఇచ్చారో తేల్చండి. ప్రతిదానికీ సీఎం పేరు చెబుతున్నారు కదా? సీఎంఓకు ఎన్ని టికెట్లు ఇచ్చారు? ఐఏఎస్, ఐపిఎస్‌లకు ఎన్ని ఇచ్చారో వివరాలివ్వండి. మొన్న చైర్మన్‌కు తెలియకుండా ఈఓ ఎలా ప్రెస్‌మీట్ పెట్టారు? ఇకపై బోర్డుకు సమాచారం ఇచ్చిన తర్వాతనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి. లేకపోతే మేం తీర్మానం చేసేంతవరకూ వెళ్లాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

తిరుపతిలో జరిగిన విషాదానికి బోర్డు ఎలా బాధ్యత వహిస్తుందని ప్రశ్నల వర్షం కురిపించారు.

అసలు మీరు కింద కౌంటర్లు పెడుతున్నట్లు గత బోర్డు మీటింగులో చెప్పారా? పోనీ నిర్ణయం తీసుకున్న తర్వాత మాకేమైనా బాధ్యతలు అప్పగించారా? మీరు అన్ని నిర్ణయాలు తీసుకున్న తర్వాత మాకు చెప్పడం ఏమిటి? ఇకపై బోర్డు నిర్ణయించిన వాటినే అమలు చేయండి అని స్పష్టం చేశారు.

సభ్యుల ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరయిన ఈఓ, అడిషనల్ ఈఓ.. వారు మాట్లాడున్నంత సేపు నిర్ఘాంతపోయి, చేష్టలుడి చూస్తుండిపోయినట్లు సమాచారం. చివరకు మీ అధికారాలు-మా అధికారాలకు సంబంధించిన నోట్‌ను, వచ్చే సమావేశం నాటికి ఇస్తామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా నిబంధనలకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను కూడా అందిస్తామని చెప్పడంతో, సభ్యులు శాంతించినట్లు సమాచారం. మొత్తానికి ఈఓ, అడిషనల్ ఈఓలు సీఎం పేరు చెప్పి.. తమను నిమిత్తమాత్రులను చేస్తున్నారని సభ్యులు ఆలస్యంగా గుర్తించినట్లు స్పష్టమయింది.

## స్కిల్ సెన్సస్ ప్రి-వాలిడేషన్ కోసం ఇన్ఫోసిస్‌తో ఒప్పందం

- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయు
- ఇన్ఫోసిస్ చొరవ అభినందనీయం... మంత్రి నారా లోకేష్



**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనకరంగా చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడానికి ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ ఇన్ఫోసిస్ ముందుకు వచ్చింది. ఎటువంటి ఆర్థిక వనరులతో సంబంధం లేకుండానే స్కిల్ సెన్సస్ లో భాగంగా జనరేటివ్ ఎఐని ఉపయోగించి అభ్యర్థుల నైపుణ్యాల ముందస్తు ధ్రువీకరణ కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అందించేందుకు ఇన్ఫోసిస్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్-ఎస్డీసీ) నడుమ రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద స్కిల్ సెన్సస్ డాటా ప్రివాలిడేషన్ కు ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. దీనిద్వారా రాష్ట్రంలో యువత ప్రస్తుత నైపుణ్యాలను అంచనా వేసి, మార్కెట్ డిమాండ్ కు తగ్గట్టుగా వారికి స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ ఇవ్వడానికి మార్గం సులభతరం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యసాధనలో భాగస్వామి కావడానికి ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ ప్రతినిధులు సంతోష్, తిరుమల, స్కిల్ డెవలప్ మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ మెంట్ ఉన్నతాధికారులు గణేష్ కుమార్, దినేష్ కుమార్, రఘు పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్ లో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ లెర్నింగ్ పాత్‌వేస్‌కు విద్యార్థులను కనెక్ట్ చేసే యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లను సృష్టించి, నిరంతర అభ్యాసాన్ని సులభతరం చేస్తుంది. పరిశ్రమ అవసరాలను తీర్చడానికి ఏపీఎస్ఎస్డీసీకి సహకరిస్తుంది. ఔత్సాహికులకు ఉచితంగా నేర్చుకునే అవకాశాలను కల్పించడం, సాంకేతికత అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫారమ్ నిర్వహణ ఇన్ఫోసిస్ చేపడుతుంది.

అభ్యర్థుల నైపుణ్యాలను సమర్థవంతంగా అంచనావేయడానికి జనరేటివ్ ఇన్ఫోసిస్ డిజిటల్ ప్లాట్ ఫారంను అభివృద్ధి చేసి అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫారమ్ వివిధ పరిశ్రమలలో అవసరమైన నైపుణ్యాల సమగ్ర మూల్యాంకన చేస్తుంది. ఇందులో భాగంగా అభ్యర్థుల ప్రస్తుత నైపుణ్య స్థాయిలను అంచనా వేసి ముందస్తు ధ్రువీకరణకు చర్యలు చేపడతారు. ప్రాథమిక అంచనాను బట్టి అభ్యర్థుల ప్రస్తుత నైపుణ్యాలు, తదుపరి అభివృద్ధి కోసం సిఫార్సులు చేస్తారు.

ఇందులో భాగంగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ ప్లాట్‌ఫారమ్‌లో క్యూరేటెడ్ లెర్నింగ్ పాత్‌వేస్‌తో ఔత్సాహికులను కనెక్ట్ చేస్తుంది, ఉచిత ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించి అంచనా వేసిన నైపుణ్యాలు, కెరీర్ ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతర నైపుణ్యాభివృద్ధి కోసం సాంకేతిక సహకారాన్ని ఇన్ఫోసిస్ అందిస్తుంది.

ఇన్ఫోసిస్ పారదర్శక, డేటా ఆధారిత ఫలితాలను నిర్ధారిస్తూ నైపుణ్య అంచనాల పురోగతి, ఫలితాలను ట్రాక్ చేయడానికి ఈ ఒప్పందం దోహదపడుతుంది. రాష్ట్రంలో 15-59 సంవత్సరాల నడుమ వయసు కలిగిన 3.59 కోట్లమందికి సంబంధించి నైపుణ్యాలను ఇన్ఫోసిస్ ప్రి-వాలిడేషన్ చేసి అందిస్తుంది. దీనిద్వారా ప్రస్తుతం ఎపి ప్రభుత్వం చేపడుతున్న స్కిల్ సెన్సస్ ఫ్రేమ్‌వర్క్, నైపుణ్యం అప్లికేషన్‌లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ఏకీకరణను సులభతరం అవుతుంది. విద్యా సంస్థలలో మూల్యాంకన సాధనాల అమలుకు అవసరమైన మద్దతును లభిస్తుంది.



**వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి మరింత శక్తిని కల్పించి, వారు సంకల్పించిన 2047లో వికసిత్ భారత్ విజయవంతం కావాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్టు బండారు దత్తాత్రేయ తెలిపారు.**

డిజిటల్ న్యూస్ పేపర్
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
శనివారం 11, జనవరి 2025

# ఆహ్వానం

10వ సంక్రాంతి ఆత్మీయ కలయిక

దశాబ్దకాలంగా కొనసాగుతున్న ఒక ఆదర్శమైన ఆనవాయితీ.

అన్ని రాజకీయ పార్టీలు, సిద్ధాంతాలు, అస్తిత్వ ఉద్యమాల ప్రతినిధులు
ఆత్మీయంగా ఆలోచనలను కలిసి పంచుకునే ప్రజాస్వామిక వేదిక.
ఆంధ్రుల భవిష్యత్తు కోసం, అభివృద్ధి అభ్యుదయ
ప్రణాళికలను సంసిద్ధం చేసుకునే సందర్భం

## సంక్రాంతి ఆత్మీయ కలయిక

తప్పనిసరిగా మిత్రులతో కలిసి రండి
మా ఆహ్వానాన్ని మన్నించండి..

సమయం :
**ది. 11.01.2025, శనివారం సా: 4.00 గం.ల నుంచి**

వేదిక : **సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియం**
మొఘల్రాజపురం, విజయవాడ

సంక్రాంతి శుభాకాంక్షలతో...

**వి వి కృష్ణా రావు**
జాతీయ మాజీ అధ్యక్షులు, సమతా పార్టీ
జాతీయ మాజీ కార్యదర్శి
హింద్ మజ్దూర్ కిసాన్ పంచాయత్

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

03

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025

## టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమే

- అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా ?
- ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం?
- ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ : మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్:** ఒక మహిళ మృతి చెందారు, ఇక మీదట సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రెండు వారాలు కూడా తిరగకముందే ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా మాట మార్చారు. టికెట్ రేట్లు పెంచేది లేదంటూ అదే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు సైతం స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలు అయ్యాయి. అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా ? అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమే. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతాం.

మాట తప్పం , మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు, మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్? దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి?



## వైద్య, ఆరోగ్య శాఖలో
# ఖాళీల భర్తీకి మంత్రి ఆదేశం

- ప్రజలకు మెరుగైన సేవలకు డాక్టర్లు, పేరా మెడికల్ సిబ్బంది నియామకం అవసరమన్న మంత్రి
- మంజూరైన పోస్టులు, ఖాళీలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష
- కథ నడిస్తే చాలు... బిజినెస్ యాజ్ యూజ్‌వల్ అన్న వైఖరిని వైద్య సిబ్బంది మార్చుకోవాలని మంత్రి హితవు
- హనీమూన్ కాలం అయిపోయింది... కొత్త ఆలోచనలతో పనితీరును మెరుగు పర్చుకోవాలని నొక్కివక్కాణించిన మంత్రి
- ప్రతి పథకం అమలుపై నెల వారీ నివేదికలు కోరిన సత్యకుమార్ యాదవ్

**అమరావతి:** ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాల నిర్వహణ తీరు, వైద్య సిబ్బంది కొరత, సిబ్బంది దృక్పథం, జవాబుదారీతనం విషయాలకు సంబంధించి రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం నాడు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘమైన సమీక్ష చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. పలు కేటగిరీల్లో మంజూరైన పోస్టులు, సిబ్బంది లభ్యతను సమీక్షించి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 7 నుంచి 8 వేల సిబ్బంది నియామకానికి అవకాశాలున్నందున ఆమేరకు ప్రాధాన్యతలఆధారంగా తక్షణమే కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

గత ఏడు నెలలుగా వివిధ స్థాయిల్లో వైద్య సిబ్బంది పనితీరును వివరించి 'కథ నడిస్తే చాలు' అన్న వైఖరిని విడనాడి కొత్త ఆలోచనలతో వివిధ పథకాల కింద ప్రజలకందించే వైద్య సేవల నాణ్యతను పెంచి జవాబుదారీతనంతో పని చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచంచారు. ప్రతి నూతన ప్రభుత్వానికీ లభించే ఆరేడు నెలల హనీమూన్ కాలం ముగిసిందని, ఇకనుండి వైద్య సిబ్బంది పనితీరు, ఫలితాలకు సంబంధించి క్రమానుగతంగా సమీక్షించి ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, సంబంధిత మంత్రులు మరియు సిబ్బంది ప్రజలకు జవాబు చెప్పుకోవాలని, ఈ సమిష్టి బాధ్యతను వైద్య సిబ్బంది గుర్తించాలని సూచించారు. వివిధ పథకాల అమలు, ఫలితాల్ని సమీక్షించడానికి వీలుగా నెలవారీ నివేదికల్ని సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఆయా పథకాల అమలుకు సంబంధించి నిరంతరం ప్రజలకు సమాచారాన్ని అందించే బాధ్యత సంబంధిత శాఖాధిపతులదని మంత్రి స్పష్టం చేశారు. సిబ్బంది లభ్యత గురించి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ కింద ప్రధాన విభాగాల్లో మొత్తం 1,01,125 పోస్టులు మంజూరై ఉండగా, ప్రస్తుతం వివిధ కేటగిరీల్లో 26,263 ఖాళీలున్నాయని మంత్రి వెల్లడించారు. ఈమేరకు మొత్తం మంజూరైన సిబ్బందిలో 25.97 శాతం కొరత ఉందన్నారు.

ఈ వివరాలు...."జీరో వేకెన్సీ" కింద ఆరోగ్య శాఖలో ఎటువంటి ఖాళీలు లేకుండా సిబ్బందిని నియమించామని గత ప్రభుత్వాధినేతలు చేసుకుంటున్న ప్రచారంలో డొల్లతనాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. డాక్టర్ల కొరత 21.41 శాతం ఉందని, ఇతర పేరా మెడికల్ మరియు సహాయక సిబ్బంది కొరత 26.78 శాతముందని మంత్రి వివరించారు.

ప్రభుత్వ బోధానాసుపత్రుల్లో సిబ్బంది కొరత 37.04 శాతం ఉండగా, ప్రాథమిక వైద్య సేవలందించే ఆసుపత్రుల్లో ఇది 28.96 శాతం ఉందని, ప్రాంతీయ మరియు జిల్లా ఆసుపత్రుల్లో 14.51 శాతం కొరత ఉందని, ఆయుర్వేద, హెూమియోపతి మరియు యునాని ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత అత్యధికంగా 63.40 శాతముందని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం హెూమియోపతి, ఆయుర్వేద, యునాని వైద్యాల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై స్పందిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. .టి.కృష్ణబాబు ఖాళీగా చూపబడిన మొత్తం పోస్టుల్లో కొన్నింటిని రద్దుచేసి సమకాలీన అవసరాల కోసం కొత్త పోస్టుల్ని కల్పించడం జరిగిందని, మరికొన్ని పోస్టుల్ని పదోన్నతుల ఆధారంగా భర్తీ చేయాల్సి ఉంటుందని వివరించారు. సిబ్బంది కొరతను సమగ్రంగా సమీక్షించి ప్రాధాన్యతల ఆధారంగా ఏడెనిమిది వేల పోస్టుల భర్తీకి ప్రణాళిక రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

తరచుగా త్రాగునీరు, కీటక జనిత వ్యాధులు ప్రబలడం, ప్రస్తుత జీవన అలవాట్ల ఆధారంగా భారీ స్థాయిలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి అసంక్రమిక( నాన్ కమ్యునకబుల్) వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో శుభ్రత, సరైన జీవన విధానం మరియు ఆహారం విషయాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించడానికి ప్రభావంతమైన ప్రచార కార్యక్రమాన్ని తక్షణమే రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ అసంక్రమిక వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు సమాజంలోని ప్రతిష్టాత్మకమైన వ్యక్తులు, సంస్థల సేవల్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

ఏపీ సచివాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో వైద్య,ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ మరియు నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ వర్చువల్‌గా పాల్గొనగా సెకండరీ హెల్త్ డైరెక్టర్ మరియు ఎపిఎంఎస్ ఐడిసి ఎం.డి డాక్టర్ ఎ.సిరి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్, ఈఓల జోలికి సీఎం ఎందుకు వెళ్లడం లేదు?

- వారి సమన్వయ లోపంతోనే ప్రమాదమని స్పష్టంగా తెలుస్తోంది
- దేవాదాయశాఖ మంత్రి ఎందుకు బాధ్యత తీసు కోవడం లేదు
- పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పి ఊరుకుంటే ఎలా?
- ఆయన ప్రాయశ్చిత్త దీక్ష ఎప్పుడు చేస్తారో చెప్పాలి
- తొక్కిసలాటపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- విశాఖపట్నంలోని క్యాంప్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ.



**విశాఖపట్నం:** టీటీడీ చైర్మన్, ఈవోల మధ్య సమన్వయం లేదని, క్షతగాత్రుల పరామర్శకు వచ్చిన ముఖ్యమంత్రి ఎదుటే వారిద్దరూ ఒకరినొకరు దూషించుకున్నారని టీడీపీ అనుకూల పత్రిక బ్యానర్ వార్త ప్రచురించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ఇదే విషయం చెప్పారు. కానీ వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారు?

తొమ్మిది కేంద్రాల్లో దర్శనం టికెట్ల పంపిణీ చేపడితే మూడు చోట్ల జరిగిన తొక్కిసలాటల్లో భక్తులు ప్రాణాలు కోల్పోయారు. కానీ ప్రభుత్వం మాత్రం ఒక సంఘటనలోనే డీఎస్పీని బాధ్యుడ్ని చేస్తూ సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకుంది. మూడు చోట్ల జరిగిన తొక్కిసలాటల్లో 40 మంది వరకు క్షతగాత్రులయ్యారు. మరో కౌంటర్లో ఒకరు చనిపోయారు. వాటి విషయంలో ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో చెప్పాలి.

తిరుపతి తొక్కిసలాట ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. అదే విధంగా ఈ ఘటనను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటో కేసుగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, వరుస ఘటనలతో తిరుమల ప్రతిష్టపై భక్తుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, దాన్ని కాపాడాలని న్యాయమూర్తిని కోరారు.

టీటీడీ చైర్మన్, ఈవో మధ్య సమన్వయ లోపంతోనే ఘటన జరిగిందని పత్రికలు, డిప్యూటీ సీఎం చెబుతున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో సీఎం చంద్రబాబు ఎందుకంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని బొత్స ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పినంత మాత్రాన పోయిన భక్తులు ప్రాణాలు తిరిగి రావని, ఆయన ప్రాయశ్చిత్త దీక్ష ఎప్పుడు చేస్తారో చెప్పాలని విశాఖలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ కోరారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవదేవుడి దర్శన టోకెన్ల కోసం వచ్చిన భక్తుల్లో ఆరుగురు చనిపోయిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. సరైన ఏర్పాట్లు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన కారణంగానే తొక్కిసలాట జరిగి ఆరు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 40 మంది క్షతగాత్రులయ్యారు. భక్తులు చనిపోవడం దైవ నిర్ణయం అంటూ.. ఈ దుర్ఘటనపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందించిన తీరు మరింత బాధ కలిగించింది.

వైకుంఠ ద్వారదర్శనం కోసం టికెట్లు ఇచ్చే కార్యక్రమం విషయంలో ప్రభుత్వం, టీటీడీ అధికారులు కనీసం రివ్యూ మీటింగ్ నిర్వహించి ఉంటే ఇలాంటి ఘోరం జరిగేది కాదు. 8వ తేదీ వరకు కుప్పంలోనే ఉన్న సీఎం చంద్రబాబు కానీ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి కూడా టికెట్ల పంపిణీపై కార్యక్రమంపై సమీక్ష చేసి ఉండాల్సింది.

ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్టు కాదు. ఏపీ హైకోర్టు ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గత రెండు రోజులుగా పత్రికల్లో వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకుని సుమోటో కేసుగా స్వీకరించి విచారణ జరపాలి. తిరుమల దేవస్థానం విశిష్టతను కాపాడాలన్నా, భక్తుల్లో ఉన్న అభద్రతను పోగొట్టాలన్నా పటిష్టమైన విచారణ చేపట్టాలని వైఎస్సార్సీపీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే పవన్‌కళ్యాణ్ క్షమించమని చెప్పినంత మాత్రాన సరిపోదు. ఆయన ప్రాయశ్చిత్త దీక్ష ఎప్పుడు చేస్తున్నారో చెప్పాలి.

పది రోజులు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడమే తప్పు అన్నట్టు నిన్న చంద్రబాబు చెప్పడం, తమ ప్రభుత్వ చేతకానితనాన్ని ఒప్పుకోవడమే. వైఎస్సార్సీపీ హయాంలో నిర్వహించినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తులు ప్రశాంతంగా దేవదేవుణ్ని దర్శించుకున్నారు.

తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో హడావుడి చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడెందుకు క్షమాపణలు చెప్పేసి ఊరుకున్నారు. టీటీడీ చైర్మన్, ఈఓ ప్రెస్‌మీట్ పెట్టి క్షమాపణలు చెప్పాలని ఆయన చెబుతున్నాడు. క్షమాపణలు చెప్పినంత మాత్రాన వారు చేసిన పాపం కరిగిపోతుందా, పోయిన భక్తుల ప్రాణాలు తిరిగొస్తాయా?. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బ తిన్నాయి. దానికి సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ చైర్మన్, ఈవోలలో ఎవరు బాధ్యత వహిస్తారు?. తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, ఆ కుటుంబాలకు అండగా నిలవాలని మా నాయకుడు వైయస్ జగన్ బయలుదేరితే అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు.

## మోడీతో బాబుది సక్రమ సంబంధం అయితే...
# జగన్‌ది అక్రమ సంబంధం

- విశాఖ స్టీల్ మీద ఎటువంటి ప్రకటన లేదు
- ఉత్తరాంధ్ర-రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు గురించి మాట్లాడలేదు
- కడప స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు
- రాజశేఖర్ రెడ్డి వారసుల్లో బీజేపీని వ్యతిరేకిస్తుంది నేను మాత్రమే
- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి
- రాజీనామా చేయకుంటే ప్రధాని మోడీ అమిత్ షాను బర్తరఫ్ చేయాలి
- జై బాపూజీ, జై భీం, జై సంవిధాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

**విశాఖపట్నం:** ఏపీ ప్రజలను ప్రధాని మోడీ దారుణంగా వెన్నుపోటు పొడిచారు. హెూదా ఇస్తామని మోసం చేశారు. మొన్న మోడీ విశాఖ వచ్చినప్పుడు కనీసం విభజన హామీలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. విశాఖ స్టీల్ మీద ఎటువంటి ప్రకటన లేదు. ప్రైవేటీకరణ మీద వైఖరి ఏంటో చెప్పలేదు. ఉత్తరాంధ్ర-రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు గురించి మాట్లాడలేదు. కడప స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు.

అలాంటి పార్టీతో టీడీపీ-జనసేన పొత్తు పెట్టుకున్నాయి. ఇదెక్కడి న్యాయం. ఏపీ ప్రజలను దారణంగా మోసం చేసిన మోడీతో చంద్రబాబుది సక్రమ సంబంధం అయితే... జగన్‌ది అక్రమ సంబంధం. బడుగు బలహీన వర్గాల ఓట్లుతో గెలిచిన జగన్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను గంగలో కలుపుతున్నారు. రాజశేఖర్ రెడ్డి మతతత్వ బీజేపీని నిరంతరం వ్యతిరేకించారు. ఆయన వారసులమని చెప్పుకునే జగన్ బీజేపీతో ఎందుకు కొమ్ముకొస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి వారసుల్లో బీజేపీని వ్యతిరేకిస్తుంది నేను మాత్రమే. ఈ రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. మన దేశాన్ని రక్షించుకోవాలి అంటే కాంగ్రెస్ పార్టీ అవసరం. పార్లమెంట్‌లో అమిత్ షా అంబేద్కర్ గురించి హేళన గా మాట్లాడారు. అంబేద్కర్ పేరును ఫ్యాషన్ అంటూ అవమానించారు.

సభలో అంబేద్కర్ పేరు చెప్పగానే బీజేపీ ఎంపీలు నవ్వుతున్నారు. అంబేద్కర్ జపం కాంగ్రెస్ పార్టీ చేస్తుంది. భారత రాజ్యాంగం రాసింది అంబేద్కర్. ఆయన రాసిన రాజ్యాంగం ఇవ్వాల్టికి మనకు శాసనం. మనకు ప్రజాస్వామ్యం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం. మన ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు. సమానంగా, స్వేచ్ఛగా, సగౌరవంగా బ్రతుకుతున్నారు అంటే రాజ్యాంగం కల్పించిందే. మేము ఎప్పుడు అంబేద్కర్ జపం చేస్తాం. మీరు జపం చేయడానికి వచ్చిన కష్టం ఏంటి? అంబేద్కర్ అంటే బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగు నింపారు. అంటరానితనం నిర్మూలన పై అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశారు. బీజేపీ హేళన విధానాలను దేశం గమనిస్తుంది. బీజేపీ రాజ్యాంగాన్ని హేళన చేస్తుంటే రాష్ట్ర ఎంపిలు మౌనం గా ఉన్నారు. టీడీపీ,వైసిపి,జన సేన ఎంపిలు మౌనం వహించారు.

ఏపిలో దళిత బిడ్డలను అవమానించారు. ఈ దేశ సంపదను అదానీకి మోడీ కట్టబెడుతున్నారు. దోచుకోవడం దాచుకోవడం మోడీ సిద్ధాంతం. ఈ రాష్ట్రంలో




బీజేపీ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ఈ రాష్ట్రంలో షర్మిలా రెడ్డి మాత్రమే పోరాటం చేస్తుంది. మన దేశాన్ని రక్షించుకోవాలి అంటే కాంగ్రెస్ పార్టీ అవసరం.

కాంగ్రెస్ తోనే దేశాభివృద్ధి. బీజేపీ అధికారంలో అంటే దేశాన్ని అమ్మేస్తారు. అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేయకుంటే మోడీ వెంటనే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి.

### అంబేద్కర్‌ను బీజేపీ అవమానించింది: మణిక్కం ఠాగూర్

పార్లమెంట్ వేదికగా అంబేద్కర్ ను బీజేపీ అవమానించింది. నిండు సభలో అంబేద్కర్‌కి అవమానం జరిగితే వైసిపి, టీడీపీ,జనసేనా ఎంపీలు మౌనం వహించారు. బీజేపీకి రాజ్యాంగం అంటే గౌరవం లేదు. బీజేపీ విధానాలను ఎండగడతాం.

## రూ.168 కోట్లతో
# చేనేత అభయహస్తం పథకం అమలు

- చేనేత అభయహస్త పథకానికి ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రికి కృతజతలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్:** రాష్ట్రంలోని చేనేత మరియు మరమగ్గముల కార్మికుల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధి కోసం రూ.168 కోట్లతో చేనేత అభయహస్త పథకాన్ని తెలం గాణ ప్రభుత్వం అమలుచేస్తుందని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని ఆమోదించినందుకు గౌరవ ముఖ్యమంత్రి వర్యులకు మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి మరియు అభి వృద్ధికి కట్టుబడి ఉందనేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే అని మంత్రి తెలిపారు.

ఈ పథకం ద్వారా తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న భీమా), తెలంగాణ నేతన్నకు భరోసాలు అమలు చేయడం జరుగుతుందని, నేతన్న పొదుపు కోసం బడ్జెట్లో రూ. 115.00 కోట్లు, నేతన్న భద్రత కోసం రూ. 9 కోట్లు, నేతన్న భరోసా పథకానికి రూ. 44 కోట్లు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.

తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి) ద్వారా చేనేత కార్మికులు తమ వాటా 8 శాతం పొదుపు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం వాటా జమ చేస్తుందని, దీని ద్వారా దాదాపు 38000 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందే అవకాశం ఉందన్నారు. అదే పవర్ లూమ్ కార్మికులయితే, వారు 8 శాతం పొదుపు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 8 శాతం వాటా జమ చేస్తుందని, దీని ద్వారా దాదాపు 15000 మంది పవర్ లూమ్ కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు.

తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న భీమా) ద్వారా చేనేత మరియు పవర్ లూమ్ కార్మికులు మరియు అనుబంధ కార్మికులందరికీ జీవిత భీమా అందించడం జరుగుతుందని, నమోదు చేసుకున్న కార్మికులు ఏ కారణంతోనైనా మరణిస్తే, మరణించిన కుటుంబం యొక్క నామినీకి రూ. 5 లక్షలు చెల్లించబడుతుందని తెలిపారు. తెలంగాణ నేతన్నకు భరోసా ద్వారా చేనేత కార్మికులు తెలంగాణ మార్క్ లేబుల్‌ను ఉపయోగించి తయారుచేసిన తెలంగాణ వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు మరియు వేతన మద్దతు అందించే విధంగా, పని ఆధారంగా ఒక సంవత్సరానికి ఒక్కొక్క చేనేత కార్మికునికి రూ. 18000 వరకు, అనుబంధ కార్మికునికి రూ. 6000 వరకు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే చేనేత రంగానికి రూ. 874 కోట్లు విడుదల చేసామన్నారు. అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టినవే రూ. 465 కోట్లు ఉన్నాయని గుర్తుచేశారు. అలాగే నేతన్నలకు నిరంతరం పని కల్పించాలనే ఉద్దేశంతో అన్నీ ప్రభుత్వ శాఖలు/కార్పొరేషన్/సొసైటీలు తప్పని సరిగా తమకు కావలిసిన వస్త్రములను టెస్కో (%u+ాజూ%) ద్వారానే కొనుగోలు చేసేలా జీవో నెం. 1 తేది: 11.03.2024 తీసుకొచ్చామన్నారు. మరియు ఇందిరా మహిళా శక్తి చీరల పథకం కూడా అమలుచేస్తున్నామన్నారు.

అంతేకాకుండా చేనేత కార్మికుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రూ. 50 కోట్ల కార్పస్ ఫండ్ తో నూలు డిపో ఏర్పాటు చేసామని, నేతన్నకి చేయూత క్రింద చేనేత కార్మికులకు రూ. 290.09 కోట్లు విడుదల చేసామన్నారు.

రూ. 22.25 కోట్ల నిధులతో నేతన్న భీమా, పావలవడ్డీ పథకం కింద 60 చేనేత సహకార సంఘాలకు రూ. 1.09 కోట్లు, మరమగ్గ కార్మికులకు 10% నూలు సబ్సిడి పథకం కింద 2018 నుండి 2022 వరకు ఉన్న అన్ని బకాయిలు రూ 37.49 కోట్లు ఈ సంవత్సరంలోనే విడుదల చేయడం జరిగిందన్నారు.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- హైదరాబాద్ అంటే టాలెంట్ సిటీ.. టెక్ సిటీ
- అత్యంత అనుకూల పరిస్థితులు ఇక్కడున్నాయి
- పారిశ్రామికవేత్తలను కోరిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**రాయదుర్గం:** ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. అలా ముందుకొచ్చే వారికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందన్నారు. శుక్రవారం రాయదుర్గంలో ఆరిక్ట్ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. ప్రభుత్వం ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యమున్న మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ నిలవబోతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని వివరించారు. 'సుపరిపాలన అంటే మెరుగైన పౌర సేవలు ప్రజల ముంగిటకు చేర్చడం. ఈ అంశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ముందు వరుసలో ఉంది.

ఎప్పటికప్పుడు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందిస్తున్నాం. ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలనుకునే కంపెనీలను మనస్ఫూర్తిగా మాతో కలిసి పనిచేసేందుకు ఆహ్వానిస్తున్నాం' అని అన్నారు. 'హైదరాబాద్ అంటే టాలెంట్ సిటీ. టెక్ సిటీ,ఇన్నోవేషన్ సిటీ,స్టార్టప్స్‌కు కేరాఫ్ అడ్రస్. ఒక్క సాఫ్ట్ వేర్ రంగంలోనే కాదు ఫార్మా, బయోటెక్ తదితర రంగాల్లోనూ అనేక పరిశ్రమలున్నాయి.

అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌళిక సదుపా యాలు, మానవ వనరులు ఇక్కడ



అందుబాటులో ఉన్నాయి. అందుకే ప్రముఖ కంపెనీలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి' అన వివరించారు. 'రోజుకో కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వస్తుంది. దానితో పాటే సవాళ్లు కూడా వస్తున్నాయి. వాటిపై కూడా ఆవిష్కర్తలు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చి దిద్దుతున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్కిట్ సీఈవో రూపేష్ కుమార్, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి సలహాదారు సాయి కృష్ణ, తెలంగాణ ఐటీ వ్యూహకర్త శ్రీకాంత్ లంక తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు


www.mahanaadu.com


డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 ||



## క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి లోకేష్ సాయం

- సీఎంఆర్ఎఫ్ చెక్కు మంత్రి అందజేత




**అమరావతి:** క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న మహిళకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సాయం అందించి అండగా నిలిచారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన 38 ఏళ్ల ఎం.స్వర్ణ దుర్గ కొన్నేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతోంది. వైద్యం కోసం ఆసుపత్రిని సంప్రదించగా.. చికిత్స నిమిత్తం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అయింది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తమకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించి ఆదుకోవాలని భర్త మాదల చంద్రశేఖర్ ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్ ను విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,51,075 చెక్కును అందజేసి వారి కుటుంబానికి తోడ్పాటును అందించారు. సమస్యను సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన వెంటనే స్పందించి ఆదుకున్న మంత్రి నారా లోకేష్ కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.



## ప్రభుత్వ శాఖలకు ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారం

- తద్వారా వాటి పనితీరు మెరుగుపరుద్దాం
- సీఎం ఆశయాలకనుగుణంగా పనిచేయాలి
- యూస్ కేసెస్‌ను త్వరితగతిన అమల్లోకి తీసుకొచ్చేలా పనిచేయండి
- త్వరలో అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**అమరావతి:** ప్రభుత్వంలో వివిధ శాఖలు తమ పనితీరు మెరుగుపరచుకోవడానికి వీలుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతిక సహకారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ఈ సంస్థ పనిచేసి మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు.

సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఆర్టీజీ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్, ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్‌లు సీఎస్ కు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ సాంకేతిక యుగంలో, ప్రభుత్వ శాఖలో మెరగైన ఫలితాలు రాబట్టడానికి అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. ఆర్టీజీఎస్ ను ప్రభుత్వంలో సాంకేతికపరంగా ఒక కటింగ్ ఎడ్జ్‌గా ఉండాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. తానుకూడా ఇకపైన ఆర్టీజీఎస్ కార్యకాలాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

### త్వరలో వాట్సాప్ గవర్నెన్స్

పౌరులకు ప్రభుత్వ సేవలను, పాలనను మరింత చేరువ చేయాలనే సదాశయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకురావాలని సంకల్పించారని విజయానంద్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను సంబంధించి పనులు ఎంతమేరకు వచ్చాయని ఆయన ఆర్టీజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఆర్టీజీఎస్ సీఈఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి అన్ని అన్ని పనులు దాదాపుగా పూర్తి చేశామని చెప్పారు. దానికి సంబంధించి డెమోను సీఎస్ కు చూపించారు. 150 రకాల సేవలను ప్రజలకు దీని ద్వారా అందించడాని సిద్ధంగా ఉన్నామన్నారు. దాంతో పాటు ప్రజలు తమ ఫిర్యాదులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చేసే వీలు కల్పిస్తున్నామని చెప్పారు. దీనిపై సీఎస్ స్పందిస్తూ వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలందరికీ సులభంగా అర్థమయ్యేలా ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లో ఉండేలా చూడాలని సూచించారు.

### ప్రతి శాఖతో సమన్వయం చేసుకోండి

ప్రభుత్వంలోని ప్రతి శాఖతోనూ ఆర్టీజీఎస్ సమన్వయం చేసుకోవాలని సీఎస్ విజయానంద్ సూచించారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న ఇన్నోవేషన్ టెక్నాలజీలను ఆయా శాఖలకు పంపి, వారి ఆర్టీజీఎస్ నుంచి ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారో వారితో నేరుగా చర్చించి, ఆయా శాఖల అవసరాలకు అనుగుణంగా సాధ్యమైనంతమేర సాంకేతిక సహకారం అందివ్వాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో లోపాలను ఎత్తి చూపడం కాకుండా, వాటి పనితీరు మరింత మెరుగవ్వడానికి ఆర్టీజీఎస్ దోహదపడేలా తన సాంకేతిక సదుపాయాలను అందించాలన్నారు. ఆర్టీజీఎస్ నుంచి ప్రతి శాఖకు ఒక ప్రతినిధిని పంపి, అక్కడి శాఖాధిపతి, అధికారులతో చర్చించి పౌరులకు అందిస్తున్న సేవలకు సంబంధించి ఆ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి సాంకేతిక పరిష్కారాలు కనుగొని ఆయా శాఖల పనితీరు మెరుగవ్వడానికి దోహదపడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి, అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయలోపమే అసలు సమస్య!

వైకుంఠ దర్శనానికి వచ్చిన ఆరుగురు భక్తులు అకాల మృత్యువాత పడటం, డజన్ల సంఖ్యలో క్షతగాత్రులవడం వెంకన్న భక్తుల మనసు కలచివేసింది. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం ప్రకటించడం మంచిదే. దర్శనభాగ్యం లభించని క్షతగాత్రులకు ప్రత్యేక దర్శనం చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అభినందించాల్సిందే. ఆ రకంగా అయినా వారికి స్వాంతన కలిగించినట్టయింది.

గతంలో ఇంతకు మించి భక్తులు అధిక సంఖ్యలో తిరుపతికి చేరుకున్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో టీటీడీకి ప్రత్యేక స్థానం ఉంది. ఎన్ని లక్షలమంది భక్తులు కొండకు వచ్చినా, కొన్ని కష్టాలున్నప్పటికీ దైవదర్శనం చేసుకుని సంతృప్తిగా వెళుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదు. గతంలో తిరుమల ఘాట్రోడ్లో 36 మంది భక్తులతో బస్సు లోయలో పడింది. అయినా ఒక ప్రాణం కూడా తీసుకోకుండా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కాపాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా అనుసరిస్తున్న విధివిధానాలను గుడ్డిగా ఇప్పటి అధికారులు, పాలకమండలి పాటించడం పెద్ద తప్పు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి కాకుండా ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా 10 రోజులు చేయడం అపశృతులకు మూలం.

గత ఈవో ధర్మారెడ్డి తప్పుడు ఆగమాలతో, సాంప్రదాయాలను పూర్తి విరుద్ధంగా చేయడంతో, గత వైసీపీ ప్రభుత్వం తలమునకలై పోయింది. వాటిని గుడ్డిగా నమ్మి పది రోజులు వైకుంఠ ద్వారం తెరవడం.. ఆగమ సలహాలను పాటించకపోవడం.. ఇప్పుడు ప్రభుత్వానికి మచ్చగా మిగులుతుందని పలువురు శ్రీవారి భక్తులు, ఆగమ సలహాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వారి ఆవేదన అర్థం చేసుకోదగ్గదే. గత ఈఓ ధర్మారెడ్డి అమలుచేసిన విధానాలను కొనసాగించడమే తప్పు. పాత విధానాలే కొనసాగిస్తే, ఇక కొత్త పాలకమండలి ఉన్నది ఎందుకు? పోనీ తిరుపతిలో టోకెన్ కౌంటర్లు ఏర్పాటుచేశామన్న విషయాన్ని ఈఓ, ఏఈఓ సీఎంకు చెప్పారా అంటే అదీ లేదు. దీన్నిబట్టి అధికారులే సొంత నిర్ణయాలు తీసుకుని, ఆరుగురు అమాయక భక్తుల చావుకు కారణమయ్యారని అర్థమవుతుంది.

ఈ ఘోరానికి ముఖ్య కారణం ఫ్రీ దర్శనం నిలిపివేయడం.. నడకదారి దర్శనాలను నిలిపివేయడంతో, తిరుమలలో ఉన్న 32 కంపార్ట్మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆ 32 కంపార్ట్మెంట్లు ఖాళీ లేకుండా భక్తులతో నిండి ఉంటే, తిరుపతిలో ఇంత గుంపులు గుంపులుగా భక్తులు ప్రత్యక్షమయ్యేవారు కాదు.

అలా గుంపులు గుంపులుగా చేరుకున్న భక్తులను బందెల దొడ్డిలో తోలినట్టుగా పార్కులోకి పంపడం, భక్తుల ఆవేదన. తొక్కిసలాట జరపకుండా నిర్లక్ష్యం వహించిన పోలీసు వ్యవస్థ టిటిడి వ్యవస్థ పై పలు రకాల విమర్శలు వెలువెత్తుతున్నాయి.

చైర్మన్ , ఈవోలు ప్రచారాలకే పరిమితమై, సామాన్య భక్తులకు పెద్ద పీట వేశానంటూ.. ఫ్రీ దర్శనాలు , కాలి నడకదారి దర్శనాలను నిలిపివేయడం... కలసి వెరసివైకుంఠ ఏకాదశి దర్శనాల విషయంలో ఘోర వైఫల్యానికి, పెను విషాదానికి కారణమవడం విచారకరం.



చైర్మన్- ఈవో అనుభవ రాహిత్యం, ఆధిపత్యపోరుతోనే ఈ అపశృతి చోటు చేసుకుందన్న విమర్శలపై, ఆత్మవిమర్శ చేసుకోవలసిన సమయమిది. కనీసం భక్తుల ప్రాణాలు కాపాడేందుకయినా, అందరూ కలసి సమన్వయంతో వ్యవహరించటం మంచిదన్న విజ్ఞుల సూచనలు పాటించడం టీటీడీ పెద్దల బాధ్యత.

చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓల సమర్థతపై నమ్మకం ఉంచి.. వారికి బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నమ్మకాన్ని వమ్ము చేయడం శ్రేయస్కరం కాదు. ఇది ఒకరకంగా ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయడమే. ఫలితంగా ముఖ్యమంత్రి ఎంపిక సరైంది కాదన్న అపవాదును ఎదుర్కోవలసి వస్తుంది. బాధ్యత తెలియని వారికి పదవులిచ్చారన్న నింద ఆయన పడాల్సి వస్తుంది. ఆరుగురు భక్తుల మృతి తర్వాత రాజకీయ ప్రత్యర్థుల నుంచి,ఇప్పటికే అలాంటి విమర్శలు మొదలవడాన్ని విస్మరించకూడదు. అందుకే ఆయన, బాధ్యత తీసుకున్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కదా అని కటువుగా వ్యాఖ్యానించవలసి వచ్చింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భక్తుల మనసులో గూడుకట్టుకున్న అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. బోర్డులో పెద్దల మధ్య సయోధ్య లేదన్న పవన్ వ్యాఖ్యలను గౌరవించి, వ్యవస్థను సరిదిద్దుకోవలసిన బాధ్యత బోర్డు పెద్దలదే. జరిగిన విషాదానికి క్షమాపణలు కోరిన పవన్ రాజనీతిజ్ఞత, హుందాతనం, మానవత్వాన్ని మెచ్చుకోవలసిందే.

నిజానికి ఆ బాధ్యత ఈఓ, ఏఈఓ, పాలకమండలిది. ప్రధానంగా దేవదాయశాఖ మంత్రిది. కానీ తన శాఖకు సంబంధం లేకపోయినా బాధితులు, మృతుల కుటుంబాన్ని పరామర్శించి.. జరిగిన దారుణానికి ప్రభుత్వం తరఫున క్షమాపణ చెప్పిన పవన్ పెద్దమనసును అభినందించడం అందరి బాధ్యత.

భక్తులు కోటి ఆశలతో వచ్చి క్యూలైన్లలో నిలబడితే, పోలీసులు వారిని అనాగరికంగా, అమానుషంగా లాగేయడం దారుణం. తిరుపతి క్యూలైన్లలో పోలీసుల దాదాగిరి వీడియోలలో చూసిన వారికి, భక్తులపై టీటీడీకి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టం చేసింది.

పోలీసులయినా, బోర్డు అధికారులయినా భక్తులకు సేవకులే తప్ప, పెత్తందారీలు కాదు. భక్తులిచ్చే కానుకలతోనే వారికి జీతాలిస్తున్న వైనాన్ని విస్మరించడం విచారకరం. అసలు భక్తులను నియంత్రించే విషయంలో, పోలీసు శాఖ తమ సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వడం లేదన్న వాస్తవం తాజా ఘటనతో తేలిపోయింది. ఇకనయినా డ్యూటీలు వేసే పోలీసులకు.. భక్తులతో నాగరికంగా, గౌరవంగా ప్రవర్తించడం నేర్పితే మంచిది. చైర్మన్, ఎస్పీ , ఈవో, అడిషనల్ ఈవో, విజిలెన్స్ ఉన్నతాధికారి అందరూ కొత్తవారు. దానితో అనుభవం లేకపోవడం.. అనుభవజ్ఞుల సలహాలు తీసుకుపోవడం తీసుకోక పోవడం.. వారి సూచనలు పాటించకపోవడంతోనే ఈ దారుణం జరిగిందన్న విమర్శలను తేలిగ్గా తీసేయకూడదు. ఏ వయసువారైనా తెలియని విషయాలు తెలుసుకోవడం సహజం. తాము సర్వజ్ఞులం అనుకోవడం మంచిది కాదు. పదవులనేవి అశాశ్వతం. చేసిన పనులే శాశ్వతం. కానీ టీటీడీ వ్యవస్థలో అది లోపించిందని, దానికి ఈ ఘటనే కారణమన్న నిందల నుంచి ఇకనయినా విముక్తి పొందితే, అది తిరుమల కొండ ప్రతిష్ఠకే మంచిది.

**- డాక్టర్. ఓవి రమణ**
టీటీడీ బోర్డు
మాజీ పాలకమండలి సభ్యులు
బలిజనాడు కన్వీనర్,
టీడీపీ సీనియర్ నాయకులు



## రేవంత్.. మీ సోదరుడిని నియంత్రించండి

- తిరుపతి రెడ్డి పక్కనే వికారాబాద్ కలెక్టర్ ఓ బాడీగార్డుగా వ్యవహరించారు
- ప్రభుత్వ కార్యకలాపాల్లో అనధికారంగా వ్యవహరించటం ఆమోదయోగ్యమా?
- కేసీఆర్ కుటుంబానికి పట్టిన గతే పడుతుంది
- సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్ హెచ్చరిక

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రోటోకాల్‌ను కాలరాస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడటాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్ ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు అనుముల తిరుపతి రెడ్డిని నియంత్రించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. తిరుపతి రెడ్డి, ఏ అధికారిక హోదా లేకున్నా, ప్రభుత్వ కార్యక్రమాల్లో అనధికారికంగా వ్యవహరిస్తున్నారని, ఈ చర్యలు అధికార దుర్వినియోగాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్పొరేటర్.. ఇలా ఏ అధికారిక హోదా లేకున్నా తిరుపతి రెడ్డి, వికారాబాద్‌లో జరిగిన ఒక అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన శంకుస్థాపన సందర్భంగా పోలీసు కాన్వాయ్, స్కూలు పిల్లలతో పరేడ్ నిర్వహించి స్వాగతం పలకడంతో పాటు రాచమర్యాదలు పొందేలా అనధికారికంగా పాల్గొన్న తీరును తప్పుబట్టారు. ఏ అధికారిక హోదా లేకున్నా, ప్రభుత్వ కార్యకలాపాల్లో అనధికారంగా వ్యవహరించటం ఆమోదయోగ్యమా? అని సుభాష్ ప్రశ్నించారు. ఇక తిరుపతి రెడ్డి పక్కనే వికారాబాద్ కలెక్టర్ ఓ బాడీగార్డుగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఇది అధికార దుర్వినియోగానికి పాల్పడటమేనని అన్నారు.

గతంలో భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో సోనియా గాంధీ అనధికారికంగా "షాడో పీఎం" గా వ్యవహరించారని సుభాష్ గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వ పాలనలో ప్రధానమంత్రి అధికారిక కార్యక్రమాల్లో సోనియా గాంధీ జోక్యం చేసుకున్న సంస్కృతినే నేడు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి అనుసరిస్తున్నారంటూ మండిపడ్డారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి వ్యవహారం కేసీఆర్ కుటుంబం యొక్క అహంకార పోకడలకు, అనధికారిక చర్యలనే తలపిస్తోందని సుభాష్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడిని నియంత్రించకపోతే, ప్రజాగ్రహానికి గురవ్వడం ఖాయమని, రాజకీయంగా కేసీఆర్ కుటుంబానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సుభాష్ డిమాండ్ చేశారు.

## భక్తి వ్యాపారానిదే పాపం!

వైకుంఠ ఏకాదశి రోజు తిరుమల, శ్రీశైలం ఆలయాలు పట్టవు. ఏంటా పిచ్చి ? వైకుంఠ ఏకాదశి మరుసటి రోజు వెళ్లండి. మూడు రోజులకు వెళ్లండి. విష్ణుమూర్తి ఏమైనా కోపడ్డతాడా ? ఉత్తరద్వారం నుంచి వెళ్లాలి, తలుపులు బద్దలైపోవాలి. మనసు నిండా మట్టిని పెట్టుకుని దేవుడ్ని ఆరోజే చూడాలి, అలాగే వెళ్లాలి. ఏదైనా సరే వెళ్లాలంటే ప్రమాదాలు జరుగుతాయి. పుణ్యక్షేత్రాలు, పుణ్య తీర్థాలు మాత్రమే కాదు. శరీరాన్ని మించిన క్షేత్రం లేదు. మనసును మించిన తీర్థం లేదు. సత్ప్రవర్తన కలిగి ఉంటే నీకు నువ్వే ఓ పుణ్యక్షేత్రం. నీకు నువ్వే పుణ్య తీర్థం'

వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం భక్తులు తోసుకుని ఘోర ప్రమాదానికి గురైన తర్వాత అప్పుడెప్పుడో అవధాని గరికపాటి నరసింహారవు చెప్పిన ఈ ప్రవచనం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ మాటల్లో ఎంతో దైవత్వం ఉంది. గరికపాటి వారు చెప్పిన మాటల్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ఇదే దేవుడి దగ్గరకు పరుగులు పెట్టాలని..ఓ ప్రత్యేకమైన ముహర్తంలోనే దర్శించుకోవాలని ఎవరూ అనుకోరు. అనుకోలేరు.

కానీ ఇవాళ భక్తి అనేది ఓ వ్యాపార వస్తువుగా మారిపోయింది.. ఓ మూఢ నమ్మకంగా మార్చేస్తున్నారు. ఫలితంగా ఎలా పుట్టుకొస్తున్నాయో తెలియదు కొన్ని పద్ధతలు పుట్టుకొస్తున్నాయి.. ఆలయాల్లో భక్తులను ముంచెత్తేలా చేస్తున్నాయి. ఫలానా రోజు దర్శించుకుంటే దేవుడు కరుణిస్తాడు.. నలుగుర్ని తొక్కేసి అయినా టిక్కెట్లు పొందేసి వెళ్లి దండం పెట్టుకుంటే ఆ పాపాలు పోతాయి అనుకోవడం దేవుడని కించపర్చడమే.

గత ఏడాది ఏప్రిల్‌లో చిలుకూరు బాలాజీ ఆలయం వద్దకు తండోపతండాలుగా జనం తరలి వచ్చారు.ఎందుకా అని చాలా మంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే.. సంతానం లేని వారి కోసం గురుడ ప్రసాద పంపిణీ చేస్తామని ఆలయ నిర్వాహకులు ప్రచారం చేశారు. గరుత్మంతునికి నైవేద్యం సమర్పిస్తామని ఆ నైవేద్యాన్ని సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు వితరణ చేస్తామని ఆ ప్రసాదం కోసం ఫలానా రోజు ఆలయానికి రావాలని ఆలయ పూజారి పిలుపునిచ్చారు.

ఆ నోటా ఈ నోటా పడి ఇసుకెస్తే రాలనంత జనం ఆలయానికి వచ్చారు. కేవలం హైదరాబాద్ వాసులే కాదు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జంటలు.. వారితో పాటు ఏపీ, కర్ణాటక నుంచి చాలా జంటలు వచ్చాయి. అలా వచ్చిన వారు రెండు లక్షల మంది ఉంటారు. ఇంత మంది వస్తారని ఊహించలేదో ఏమైనా జరిగితే సమస్య వస్తుందేమోనని అలాంటి ప్రసాదం ఏదీ పంపిణీ చేయడం లేదని చెప్పి అందర్నీ వెనక్కి పంపేశారు. ఇక్కడ ఎవరిది తప్పు ?. ప్రసాదంతో సంతానం పుట్టిస్తానని నమ్మించిన చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిదా లేకపోతే ఎంతో చదువుకున్నప్పటికీ.. ఇంకా ప్రసాదాలతో పిల్లలు పుట్టేస్తారని నమ్ముతున్న లక్షల మందిదా?.

ఇదే ఆలయానికి వీసా బాలాజీ అని పేరు పెట్టేశారు. ప్రచారం చేసేశారు. దీంతో ఇతర దేశాల్లో అవకాశాలు దక్కించుకోవాలనుకున్న వాళ్లు ఆలయానికి పెద్ద ఎత్తున వస్తారు. నిజానికి ఇలా ఆలయానికి వచ్చే వారందికీ అమెరికా చాన్సులొస్తాయా?. తమ తమ ప్రయత్నాల్లో సక్సెస్ అయిన వారికే వస్తాయి. ఇలాంటి నమ్మకాల చుట్టూ ఎన్నో జరుగుతూ ఉంటాయి. ఎందుకంటే భక్తి పేరుతో మూఢ నమ్మకాన్ని పెంచేందుకు.. దాంతో వ్యాపారం చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త శక్తులు పుట్టుకు వస్తూనే ఉన్నాయి. అందులో భాగంగానే కొత్త కొత్త నమ్మకాల్ని పుట్టిస్తున్నారు.

నిజంగా దైవత్వం గురించి చెప్పే విద్వత్ ఉన్న పండితులు.. శాస్త్రాలను ఔపాసన పట్టిన వారు జీవిత సారాలను క్షణ్ణంగా వడపోసి చెబుతున్న వారి మాటల్ని ప్రజలు నమ్మడం లేదు. కష్టాలు




తీరుస్తాయనగానే ఓ తాయత్తును కట్టుకోవడానికి రెడీ అయిపోతారు. నిజానికి దైవం అంటే నమ్మకం. మీ వెనుక దేవుడు ఉన్నాడన్న నమ్మకంతో మీరు ఎలాంటి క్లిష్టమైన ప్రయత్నాలను అయినా నమ్మకంతో చేస్తారు. గెలుపోటముల మధ్య ఉండేది ఈ నమ్మకమే. ఒకే రకమైన టాలెంట్ ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ పడితే ఒకరే గెలుస్తారు. ఎందుకంటే ఒక వ్యక్తి వద్ద ఆత్మవిశ్వాసం.. నమ్మకం ఉంటాయి. అదే దేవుడు. చేస్తున్న పనే దైవం. చేస్తున్న పని మానేసి తనకు పూజలు చేయాలని ఏ దేవుడూ కోరుకోడు.

ఎందుకంటే.. మన దేహం పోషణకు దేవుడు కల్పించేదే పని. ఆ పనిని గౌరవించకుండా.. దేవుడ్ని పూజిస్తానని బయలుదేరడం దేవుడ్ని అవమానించడమే కానీ ఆయనను పూజించినట్లుగా కాదు. ఫలానా రోజు.. ఫలానా ముహుర్తంలో దేవుడ్ని దర్శించుకోవాలన్నది కూడా ఎంతో అమాయకత్వం. ఏకాదశి, ద్వాదశిలకు ప్రత్యేకమైన పురాణాలు ఉన్నాయి. వైకుంఠ ఏకాదశి వ్రతం చేసి, విష్ణువుని పూజించి, ఉపవాసం, జాగరణ పాటించడ0 వల్ల పుణ్యఫలితాలు లభిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

ద్వాదశినాడు ద్వాదశి ఘడియలు వెళ్ళాకముందే భోజనం చేయాలి. దేవతలకు ఆరునెలలు పగలు, ఆరునెలలు రాత్రి. దక్షిణాయానం రాత్రికాలం. ఈ చీకటి తొలగి దేవతలు వెలుగులోకి వస్తారు. అంటే వారికి పగలు ప్రారంభమైనట్టు. అందుకే ఆ రోజు ఉపవాసం పుణ్యప్రదం అని చెబుతారు. అంతే కానీ అదే రోజు వెళ్లి దేవుడి దర్శనం చేసుకోవాలని ఎక్కడా చెప్పలేదు. కానీ కాలంతో పాటు పుట్టుకొస్తున్న అధ్యాత్మిక వ్యాపారస్తుల కారణంగా ఇలాంటివి పుట్టుకు వస్తున్నాయి. ఫలితంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

వైకుంఠ ఏకాదశినాడు ఇలా భక్తులు తిరుమలకు పోటెత్తే సందర్భాలు ఇటీవలే పెరిగాయి. ఓ ఇరవై ఏళ్ల కిందట తిరుమలలో ఈ పరిస్థితి లేదు. అప్పుడు నిజంగా ఈ రోజును నమ్మి వచ్చే భక్తులే ఉండేవారు. కానీ మీడియా విస్తృతి పెరిగిన తర్వాత , కొత్త కొత్త పండితులు వచ్చి వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యత ఎక్కువుగా ప్రచారం కావడం ఆ రోజు కచ్చితంగా



దర్శనం చేసుకోవాలేమో అన్న ఆలోచనను ప్రేరేపిస్తోంది. దీనికి తోడు దేశంలో ఉన్న ప్రముఖ వీఐపీలంతా దర్శనం కోసం పోటీ పడుతుండటంతో కచ్చితంగా ఆ రోజు దర్శనం చేసుకోవాలేమే అని మనలాంటి వాళ్లంతా అనుకునే పరిస్థితి వచ్చింది.

టీటీడీ కూడా ఈ దిశగా ప్రోత్సాహం ఇస్తూ వచ్చింది.అందుకే ఉత్తరద్వారం కోసం తోపులాటలు జరిగి ప్రాణాలమీదకు వచ్చింది. బుధవారం జరిగిన సంఘటనలో 6మంది ప్రాణాలు పోయాయి. ఇది ఒక్క తిరుమల లేదా తిరుపతి సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. గత ఏడాది జూన్‌లో ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన ఓ భోలే బాబా సత్సంగ్‌లో తొక్కిసలాట జరిగి 121 మంది మృతి చెందారు. జమ్మూ కశ్మీర్‌లోని వైష్ణోమాత దేవాలయంలో 2022 జనవరి ఫస్ట్ తేదిన జరిగిన దుర్ఘటనలో 12మంది భక్తులు చనిపోయారు. బీహార్‌లోని పాట్నా గాంధీ మైదాన్ 2024 అక్టోబర్ 3న దసరా వేడుకల్లో తొక్కిసలాటలో 32మంది భక్తులు మృత్యువాత పడ్డారు.

శబరిమల పుల్లమేడు దగ్గ ఘటనలో 104మంది భక్తులు చనిపోయారు. మధ్యప్రదేశ్‌లోని ధాటియా జిల్లాలోని రతన్ గడ్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగిన దుర్ఘనలో 115మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్ ప్రదేశ్‌లోని నైనా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 162మంది మృత్యువాతపడ్డారు. 2008లో కూడా రాజస్థాన్‌లోని చాముండదేవి ఆలయంలో తొక్కిసలాటలో 250 మంది మృతి చెందారు. ఇరవై ఏళ్ల క్రితం మహరాష్ట్రా సతార్ జిల్లాలోని మంధర్ దేవి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 350 మందిపైగా భక్తులు చనిపోయారు.

దశాబ్దాలుగా ఇలాంటి ఘటనలు జురగుతూనే ఉన్నాయి. కానీ ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకునే ప్రయత్నాలు చేయడం సరి లేదు కదా.. మరింతగా మూర?త్వంలోకి వెళ్లిపోతున్నారు. భక్తులను కరుణించేవాడు భగవంతుడు అయితే ఏరోజైనా.. మనస్ఫూర్తిగా శ్రద్ధగా పూజిస్తే అనుగ్రహిస్తాడు. ఎదుకంటే ఆయన దేవుడు. భగవంతుడు సర్వాంతర్యామి.. ఆయన నివాసం ఉండే ఏ గుడైనా అంతే పవిత్రం.

మరి మన ఊరిలో ఉన్న.. దగ్గరలో ఉన్న గుడికి వెళ్లకుండా ఎక్కడికో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవడం ఎందుకు ? దేవుడికి ప్రతి భక్తుడూ సమానమే.. ప్రతీరోజూ గొప్పదే. కానీ ఇలాంటి పర్వదినాలకు అవసరమైన దానికంటే ప్రాధాన్యత కల్పించడం టీటీడీ చేస్తున్న తప్పు. నిజంగా వైకుంఠ ఏకాదశి మాత్రమే ప్రాధాన్యత ఉంటే పదిరోజుల దర్శనాల పేరిట మార్కెటింగ్ చేయాల్సిన అవసరం లేదు.

ఇక్కడ రాజకీయం చొరబడిపోతోంది. ప్రతీ దానికి రాజకీయం చేయడమే. అసలు వైకుంఠ ఏకాదశి ఒక్క రోజు అయితే పది రోజుల పాటు దర్శనాలు చేయడం.. వాటికి తిరుపతిలో కౌంటర్లు పెట్టడం ఏమిటి ?. ఇలాంటి ఘోరాలు చేయడాన్ని ఎలా హైందవపెద్దలు అంగీకరించారో కానీ.. భక్తులు కూడా మూఢ నమ్మకంతో ఇలా వేల మంది వచ్చి రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి.. ప్రాణాల మీదకు తెచ్చుకునేలా..తోసుకోవడం ఎందుకో ఎవరికీ అర్థం కాదు.

దేవుడిపై ప్రతి ఒక్కరికీ నమ్మకం ఉండాలి. మన మంచి చేస్తే ప్రోత్సహిస్తాడని.. చెడు చేస్తే శిక్షిస్తాడని భయం పెట్టుకోవాలి. అంతే కాని చేయాల్సినన్ని తప్పు చేసేసి.. ఫలానా రోజు దేవుడని దర్శించుకుని హుండీలో తాను చేసిన పాపంలో కొంత భాగాన్ని సమర్పించుకుంటే పునీతులమైపోతామని అనుకోవడం పొరపాటు. అలాంటి ప్రయత్నాలు ఎంత మహిమాన్వితమైన రోజు చేసినా ప్రయోజనం ఉండదు. ఇప్పుడు వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్లిన భక్తులు ఆరుగురు తమ కుటుంబాలకు కాకుండా పోయారు.

ఇలాంటి నష్టం ఆ కుటుంబానికి ఎక్కడైనా జరుగుతుందా ?.తమ మనసును స్వచ్ఛంగా ఉంచుకుని ఎక్కడ ప్రార్థించినా దేవుడ్ని ప్రార్థించినట్లే. అధ్యాత్మిక వేత్తలు.. పవిత్ర గ్రంథాలు కూడా చెబుతాయి. భక్తులు ఆలయాలకు వెళ్లేది అక్కడి ప్రశాంతత కోసం.. ప్రశాంతంగా అన్నీ మర్చిపోయి భగవంతుడ్ని స్మరించుకోవడానికే. ఆ సూక్ష్మం మర్చిపోయి..కోరికలు కోరుకవడానికి వెళ్తూంటారు.

అలా దర్శనాలు, పూజలు చేసే వాళ్లను దేవుడు కనిపించే పని అయితే వీఐపీ దర్శనాలు చేసుకునే వాళ్లంతా ఎప్పుడో వారి కోరికల్ని.. దేవుడు ఎప్పుడో తీర్చేసేవాడు. దేవుడు..దైవత్వం గురించి అసలు సూక్ష్మాన్ని అర్థం చేసుకున్న భక్తులు.. ఇలాంటి మూఢ నమ్మకాలకు పోయి ప్రాణాలు త్యాగం చేయరు. ఇప్పటికైనా పెద్దలు చెప్పేది అర్థం చేసుకోండి.. దేవుడ్ని తక్కువ అంచనా వేయకండి!

**- రవినాయుడు కుప్పురు**

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025



## పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం

- కలెక్టర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26 వతేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించాం.. భారీ వ్యయంతో కూడుకున్నప్పటికీ, రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న భావనతో విస్తృతంగా చర్చించిన మీదటే, ఈ పథకాలను అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే, ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసాం.

ఈ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం తీసు కోవాలి. లబ్ధిదారుల ఎంపికను, ప్రతీ ఉమ్మడి జిల్లాలో ఇంచార్జి మంత్రులు ఇందిరమ్మ కమిటీలతో చర్చించిన మీదటే చేపట్టాలి. ప్రస్తుతం నిర్ణయించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీ ల ద్వారా ప్రకటించాలి. ఇప్పటికే, రాష్ట్రంలో 22000 కోట్ల రైతు రుణ మాఫీలను చేసాం.

ఈ వివరాలను కూడా ప్రతీ గ్రామంలో ప్రకటించాలి. ఈ నాలుగు పథకాలను సంబంధించి సవివరమైన మార్గ దర్శకులతో ఉత్తర్వులు జారీ చేస్తున్నాం. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను ఎంపిక చేయాలి. ఈ పథకాలపై జిల్లాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి.



## అధికారిక ఉత్సవంగా కొమురం భీమ్ వర్ధంతి, జయంతి

- ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్
- పెండింగ్ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ ను క్లియర్ చేయాలి
- వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితం
- ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆదివాసీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఆదివాసీ సంఘాల నేతలు
- ఆదివాసీల విద్య, ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను కోరిన ఆదివాసీ సంఘాలు.
- ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్డు రవాణా, సాగు, తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎంకు విన్నవించిన ఆదివాసీలు

హైదరాబాద్: నేను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మొట్టమొదటి సభ ఇంద్రవెల్లిలోనే పెట్టాం. ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతి వనంగా మార్చాలని, అమరుల కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని చర్చించుకున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పూర్తి చేసుకున్నాం. రాజకీయంగానూ ఆదివాసీలకు న్యాయం చేస్తూ ముందుకు వెళుతున్నాం.

ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. కొమురం భీమ్ వర్ధంతి, జయంతులను అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశిస్తున్నా. ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాలను వెంటనే మంజూరు చేస్తున్నాం. ఆదివాసీల మాతృ భాషలో విద్యను అందించే అంశాన్ని అధ్యయనం చేయండి. విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు సంబంధించి పెండింగ్ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ ను క్లియర్ చేయాలని అధికారులకు సూచించిన సీఎం

మంజూరైన బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోండి. ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం. ఆదివాసీ రాయి సెంటర్లకు భవనాలు నిర్మించేందుకు అధ్యయనం చేసి రిపోర్టు అందించాలి. కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలి. . ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. గోండు భాషలో ప్రాథమిక విద్యను అందించే అంశంపై అధ్యయనం చేసి రిపోర్ట్ అందించా లి . ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలి. జనాభా ప్రాతిపదికన ఇచ్చేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలి. ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టాలి. స్పెషల్ డ్రైవ్‌గా తీసుకునేందుకు అవసంమైన చర్యలు చేపట్టాలి. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

### ఆసుపత్రిలో బాధితులకు డబ్బుల కవర్లు ఇచ్చి
## బాబును తిట్టాలని చెప్పారు

- డబ్బుల కవర్లు ఇస్తున్న దృశ్యాలు ఆసుపత్రి సిసి టీవీ కెమేరాల్లో రికార్డు అయ్యాయని చెప్పిన మంత్రి ఆనం
- జగన్ స్విమ్స్ పర్యటన, క్షతగాత్రుల పరామర్శ అంశంపై సంచలన విషయాలు బయటపెట్టిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అమరావతి:పరామర్శ పరుతో జగన్ నిన్న దుష్ట చతుష్టయ యాత్ర సాగించాడు. తిరుమల దేవస్థానాన్ని భ్రష్టుపట్టించిన నలుగురే నిన్న జగన్ తో ఉన్నారు. జగన్ అసుపత్రికి వెళ్లేసరికి ఆసుపత్రిలో 18 మందికి ఉన్నారు. జగన్ వెంట ఉన్న దుష్టచతుష్టయంలోని ఒకరు జగన్ కంటే ముందు ఆసుపత్రిలోపలికి వెళ్లారు. ఆసుపత్రిలో బాధితులకు డబ్బుల కవర్లు ఇచ్చి... చంద్రబాబుకు వ్యతిరేకంగా జగన్ వద్ద మాట్లాడమని చెప్పారు.

తెలుగు దేశంపై, చంద్రబాబు నాయుడు పై వ్యతిరేకంగా చెప్పండని క్షతగాత్రులకు కవర్లు ఇచ్చారు...దీనికి వైసీపీ నేతలకు సిగ్గు అనిపించడం లేదా? 5 ఏళ్లు పాలన చేశారు. కానీ పరామర్శకు వెళ్లి ప్రభుత్వంపై, సిఎంపై ఆరోపణలు చేయమని డబ్బుల కవర్లు ఇచ్చి వస్తారా?

మీ దుష్ట చతుష్టయంలో ఒక సభ్యులు ఈ పనిచేశాడు..ఇంకా ఆ దుష్టచతుష్టయాన్ని పెట్టుకుని జగన్ ఇంకా ఊరేగుతున్నాడు. ఆస్పత్రిలో ఉన్న సిసి కెమెరాల్లో వైసీపీ నేతలు ఇచ్చిన తెల్లకవర్ల దృశ్యాలు రికార్డు అయ్యాయి. కవర్లు ఇచ్చి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడమని చెప్పిన విషయాన్ని అక్కడ ఉన్న డాక్టర్లు, సిబ్బంది కూడా గుర్తించారు. ఏం జీవితాలు అయ్యా మీవి? ఈ మానవ సమాజంలో ఉండదగిన వాళ్లా మీరు?

మృగాల మధ్య పెరగాల్సిన మీరు ఇవాళ రాష్ట్ర ప్రజల కర్మగాలి సమాజంలో తిరుగుతున్నారు. ఓ పక్క చనిపోయిన వాళ్లు.. మరో పక్క క్షతగాత్రులు ఉంటే ఆ శవాల మధ్య పేలాలు వేరుకున్నారు. జగన్ నిన్న తిరుమల నెయ్యి గురించి మాట్లాడారు. గత 5 ఏళ్ల పాలనలో అన్ని దేవాలయాల్లో తక్కువ క్వాలిటీ నాణ్యత వాడి ప్రసాదాలను అపవిత్రం చేశారు. నెయ్యి కల్తీ విషయాన్ని బయటపెట్టిందే మా ప్రభుత్వం. దీనిపై జగన్ ఏం మాట్లాడుతాడు? ప్రసాదాలు, అన్న ప్రసాదాలు క్వాలిటీ ఎంత మెరుగుపరిచామో భక్తులను అడిగి జగన్ తెలుసుకోవాలి. భక్తుల మనో భావాలు కాపాడుతాం. సామాన్య భక్తులకు శ్రీవారిని చేరువ చేస్తాం.



### ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

- విద్యుత్ లేని 1750 ఆదివాసీల గృహాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం
- 956 మంది గిరిజన గృహాలకు విద్యుత్ సరఫరా కల్పించిన మంత్రి గొట్టిపాటి
- టైగర్ రిజర్వ్ జోన్ లోని 611 కుటుంబాలకి సోలార్ బ్యాటరీతో విద్యుత్ సరఫరా

అమరావతి:ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు ఆదివాసీ తండాల్లో విద్యుత్ కాంతులను వెలిగిస్తున్నారు. యర్రగొండపాలెం నుంచి శ్రీశైలం వెళ్లే మార్గ మధ్యలో ఉన్న కొన్ని తాండాలు స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచినా కానీ ఇప్పటికీ విద్యుత్ కాంతులకు నోచుకోలేదు. దీనిని గుర్తించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విద్యుత్ ఉద్యోగులతో సర్వే నిర్వహించారు. మొత్తంగా 1750 ఆదివాసీల గృహాలు విద్యుత్ సరఫరాకు దూరంగా ఉన్నాయని మంత్రి దృష్టికి వచ్చింది. తక్షణమే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎలా అయినా సరే ఆ గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపాలని పూర్తి స్థాయిలో సోలరైజేషన్ కు అనుమతి ఇచ్చారు.

దీంతో సుమారు రూ. 2.20 కోట్లతో ఆరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు పనులు పూర్తి చేసి 956 గిరిజన గృహాలకు విద్యుత్ సరఫరా కల్పించారు మంత్రి గొట్టిపాటి రవి కుమార్. ఇంకా 611 కుటుంబాలు టైగర్ రిజర్వ్ జోన్ లో ఉన్నాయి. వాటిని కూడా అతి త్వరలోనే సోలార్ బ్యాటరీతో నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. గిరిజనుల్లో చెంచులు చాలా పేదరికంలో ఉన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుపరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల సేవే మాధవ సేవ అని ప్రభుత్వం నమ్ముతుందని అన్నారు. దీనిలో భాగంగానే పలు గిరిజన తండాల్లో విద్యుద్దీకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. త్వరలోనే టైగర్ జోన్ లో ఉన్న మిగిలిన చెంచుల కుటుంబాలకు సోలార్ ద్వారా విద్యుద్దీకరణ చేపడుతామని స్పష్టం చేశారు.

అలానే చెంచుల వ్యవసాయానికి సోలార్ ద్వారా కరెంటు ఇస్తామని హామీ ఇచ్చారు. అన్ని విధాల ప్రభుత్వం నుంచి వారికి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. చెంచులకు ఉపాధి హామీ పథకంలో భాగంగా పని దినాలు కల్పిస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలోనే గిరిజనులకు సమాన హక్కులు కల్పన జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

### ఫన్ బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు!



విశాఖ, మహానాడు: తెలుగు యూట్యూబర్ "ఫన్ బకెట్" ఫేమ్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. తనతో నటించే ఓ బాలికపై అతడు లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో విశాఖ కోర్టు ఈ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.4 లక్షల నష్ట పరిహారం కూడా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

## కళలతో సమాజంలో చైతన్యం

- కవులు, కళాకారులు తమ కలాలకు పదును పెట్టాలి, గళాలు విప్పాలి
- సామాజిక చైతన్య సదస్సులో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్: కళలు సమాజ అభివృద్ధి, ప్రజల్లో చైతన్యా నికి ఎంతగానో దోహదం చేస్తాయని, కవులు, కళాకా రులు తమ కలాలకు పదును పెట్టాలని, గళాలు విప్పాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం రవీంద్రభారతీలో నిర్వహిం చిన విధ్వంస జీవన విధానం - సాంస్కృతిక చైతన్య సదస్సుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, మేధావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానిని ప్రారంభించారు

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సంస్కృతి అంటే కేవలం ఆటపాటలు, నాట్యం, సంగీతం, సాహిత్యం, కవిత్వం, భాషకే పరిమితం కాదని, సంస్కృతి అంటే మన అస్తిత్వం. ప్రజల జీవన విధానం అని అన్నారు.

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... సాంస్కృతిక పునరుజ్జీవనం, ప్రజల జీవన విధానంలో మార్పులు తేవడానికి కవులు, కళాకారులు ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం నీడన జీవిస్తున్నాం కాబట్టి ఆ రాజ్యాంగ విలువలు మనం నిర్మించబోయే సంస్కృతికి ప్రాతిపాదిక కావాలని చెప్పారు. కుల, మాతాలకు అతీతంగా ఎదుటివాళ్లను గౌరవించడం నేర్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ... రైతులు బలహీనమైపోయి ఆత్మ హత్యలు, ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్ కు యువత బానిసలై డబ్బులు పోగొట్టుకుంటున్నారని, కుల, మత విద్వేషం, అసహనం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. రైతులు.. నిరాశ నిస్పృహలకు గురికావద్దని, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ప్రభుత్వం భరోసా నివ్వాలని, వారిలో ఆత్మ స్థైర్యాన్ని కల్పించాల్సిన అవసరం కళాకారుల పైన ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ డా. జి. వెన్నెల తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజలా, ప్రముఖ కవి జయరాజు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రముఖ కవి, పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, తెలంగాణ భాషా, సాంస్కృతిక సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, తెలంగాణ సాహిత్య అకాడమీ సెక్రటరీ డా. బాలచారి, పద్మశ్రీ ఎక్క యాదగిరి, పద్మశ్రీ మహమ్మద్ అలీ బేగ్, పద్మశ్రీ పద్మజా రెడ్డి, పద్మశ్రీ వేలు ఆనందస్వామి, పద్మశ్రీ ఉమామహేశ్వరి, పద్మశ్రీ మొగిలయ్య, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, పద్మశ్రీ కేతావత్ సోంలాల్, డాక్టర్ కళా కృష్ణ, రాఘవ రాజ్ భట్, సురభి వేణుగోపాలరావు, భాగవతుల సేతురాం, ఎంవీ రమణారెడ్డి, మాస్టర్ జి, చక్రాల రఘు, యాకూబ్, పొట్లపల్లి, దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజు, నేర్నాల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



## సంక్రాంతి వేళ ఎక్సైజ్ శాఖ పటిష్ట నిఘా

- ఎక్సైజ్,ప్రొహిబిషన్ డైరెక్టర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

అమరావతి: సంక్రాంతి పండుగ సందర్భంగా అక్రమ మద్యం పై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర స్థాయిలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు (ఎన్‌ఫోర్స్‌మెంట్), జిల్లా ఎక్సైజ్ అధికారులు , స్టేషన్ హౌస్ అధికారులను భాగస్వామ్యం చేసి భద్రతా చర్యలను చర్చించి మార్గదర్శకాలను జారీ చేశారు.

ఆటంకం రహిత మద్యం సరఫరా: డిప్యూటీ కమిషనర్లు ఏపిఎస్‌బిసి ఎల్ డిపోలను ఉపయోగించి, లైసెన్సీలకు ఇండియన్ మేడ్ లిక్కర్, బీర్ నిత్యం అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. మద్యం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా సమర్థవంతమైన నిల్వ నిర్వహణ చేయాలి.

### నిల్వల పర్యవేక్షణ, నాణ్యత నిర్ధారణ:

అన్ని డిపోలలో నిల్వలు చక్కగా అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని 24 గంటలు పర్యవేక్షించాలి. సరఫరాదారులతో సమన్వయం చేసి నిల్వలు తక్షణమే నింపి తగినంత స్టాక్ అందుబాటులో ఉంచాలి. పండుగ సమయంలో నాణ్యమైన మద్యం అందుబాటులో ఉండటం చాలా అవసరం.

### నాటుసారా తయారీపై దాడులు:

గ్రామాల్లో దాడులను పెంచి, నాటుసారా తయారీ, అమ్మకం, వినియోగాన్ని నివారించాలి. ప్రజల సమావేశాలు జరిగే ప్రదేశాలలో నకిలీ మద్యం, కల్తీ తాటి కల్లు విక్రయాలను అడ్డుకోవడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి.

సరిహద్దు నిఘాను బలపరచడం: సరిహద్దు మొబైల్ ప్యాట్రోలింగ్ పార్టీలను, ఎక్సైజ్ చెక్ పోస్టులను పూర్తి స్థాయిలో ప్రారంభించి, ఆపరేషన్లను ముమ్మరం చేయాలి. పొరుగు రాష్ట్రాల నుండి పన్ను చెల్లించని మద్యం, నకిలీ ఉత్పత్తుల ప్రవాహాన్ని నిరోధించడానికి సరిహద్దుల్లో నిఘా పెంచాలి.

స్మగ్లింగ్ నివారణ చర్యలు: స్టేషన్ హౌస్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మద్యం స్మగ్లింగ్ మార్గాలపై నిఘా పెట్టి దాడులు జరపాలి. కల్తీ తాటి కల్లు అమ్మకాలను అరికట్టాలి. తాటి కల్లు దుకాణాలను నియంత్రించి, మందుల కల్తీ జరుగుతోందా అనే దానిపై గట్టి పర్యవేక్షణ చేయాలి. తాటి కల్లు నాణ్యత పరిశీలించేందుకు క్రమం తప్పకుండా శాంపిలింగ్ టెస్టులు నిర్వహించాలి.

### నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ నియంత్రణ:

పండుగ సమయంలోఎన్ డి పి ఎస్ పదార్థాల వినియోగం, పంపిణీపై గట్టి పర్యవేక్షణ అవసరం. పంపిణీ, వినియోగాన్ని అడ్డుకోవడానికి ఇతర సంస్థలతో సమన్వయం జరగాలి.



### సంపద సృష్టిలో భాగమే...
## 'వర్క్ ఫ్రమ్ హెూమ్'

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే పుల్లారావు

చిలకలూరిపేట, మహానాడు: సంపద సృష్టి విధానంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వర్క్ ఫ్రమ్ హెూమ్ (ఇంటి నుంచే పని చేయడం) విధానానికి శ్రీకారం చుట్టారని, దానిలో భాగంగానే హెూమ్ ట్రయాంగిల్ సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ) తో కలిసి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా - హెూమ్ ట్రయాంగిల్ సంస్థ నిర్వహించిన మెప్మా బజార్ ను ప్రారంభించి పరిశీలించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ఆదాయం పెంచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు వాస్తవ రూపం ఇచ్చేలా ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేప్మా సిబ్బంది, జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సామద్ ఖాన్, మద్దూమాల రవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులున్నారు.

## ఆ ఘటనల్లో జగనే మొదటి ముద్దాయి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కర్నూలు: గడిచిన అయిదేళ్లలో రాష్ట్రంలో జరిగిన ఎన్నో హింసాత్మక ఘటనల్లో జగనే మొదటి ముద్దాయి అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన మంత్రి స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ నాగ రాజుతో కలిసి మాట్లాడారు. తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనిత, అనగాని సత్యప్రసాద్ తో పాటు పలువురు మంత్రులు ఘటనా స్థలానికి వెళ్లారన్నారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి, అండగా నిలిచారన్నారు.

ఇప్పటికే తొక్కిసలాటకు బాధ్యులుగా గుర్తించిన కొందరు అధికారులపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున్న నష్టపరిహారంతో పాటు కుటుంబంలోకి ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కూడా ఇవ్వనున్నామన్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.2 లక్షలు అందించడంతో పాటు మొత్తం వైద్యం ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు.

ప్రజల్లో కష్టాల్లో ఉన్నప్పుడు వారి వెంటే ఉంటూ, అన్నివిధాలా అండగా నిలుస్తూ.. సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇస్తుంటారన్నారు. విజయవాడలో కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో బాధితులు కోలుకునే వరకు అక్కడి కలెక్టర్ కార్యాలయంలో ఓ బస్సులో పది రోజులపైగా సీఎం చంద్రబాబు బస చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.



### జగన్‌కు శవ రాజకీయాలు అలవాటే..

తిరుపతిలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రజలంతా తల్లడిల్లుతుంటే జగన్ మాత్రం శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ అసమర్థ పాలనలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిన సందర్భంలో 30 మందికి పైగా అమాయకులు బలయ్యారన్నారు. వందల ఎకరాలు పంట నీటి మునిగాయన్నారు. గొర్రెలు, మేకలు, పశువులు వరదలో కొట్టుకుపోయి, రైతులకు ఎంతో నష్టాన్ని మిగిల్చాయన్నారు.

ఆ దుర్ఘటన సమయంలో బాధితులను జగన్ పరామర్శించలేదని, బాధిత కుటుంబాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు తిరుపతి ఘటనపై జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బాబాయ్‌కి గొడ్డలి పోటు, కోడికత్తి, గులకరాయి ఘటనలతో రాజకీయాలు జగన్ అలవాటైందన్నారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని మంత్రి స్పష్టం చేశారు. గడిచిన అయిదేళ్లలో ఎన్నో హింసాత్మక ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయని, వాటన్నింటికీ జగనే మొదటి ముద్దాయి అని అన్నారు. జగన్, ఆయన పార్టీ నేతలు శవ రాజకీయాలు పక్కన బెట్టి, బాధితులకు సాయం చేయాలని హితవు పలికారు.

### అభివృద్ధిని చూసి ఓర్వలేకే...

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిని సీఎం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణ పనులకు పున:ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇది ఓర్వలేకే సీఎం చంద్రబాబుపైనా, తమ ప్రభుత్వంపైనా వైసీపీ నాయకులు, జగన్ అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. 6 నెలలో కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నో మార్పులు చేపట్టామన్నారు.

రాష్ట్ర మంతటా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాజధాని సహా అన్ని ప్రాంతాలను అభివద్ధి చేయనున్నామన్నారు. కర్నూలులో మూతపడిన రెండు బీసీ హాస్టళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప సహా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
06
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 ||

# ఆదివాసీల హామీలను విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో పోరు ఉధృతం

- బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే ఆదివాసి సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం
- ఆదివాసీలకు అభయమేది ?
- కాంగ్రెస్ పాలనలో ఆగమైన ఆదివాసి గూడేలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఆదివాసి గూడేలు ఆగమ య్యాయని, అనేక సమస్యల సుడిగుండంలో ఆదివాసీలు జీవిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కేవలం హామీలు ఇవ్వడం, ప్రకటనలు చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి హక్కులు, సమస్యలపై పోరాటఫలితంగానే శుక్రవారం నాడు ఆదివాసి సంఘాలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారని తెలిపారు. ఇది బిఆర్ఎస్ పార్టీ సాధించిన విజయ మని స్పష్టం చేశారు. అయితే, తూతూ మంత్రంగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.

ఇటీవల తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్ తో కలిసి బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ఆదివాసి గూడేలను సందర్శించానని, ఆ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను స్వయంగా చూశానని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిన ఆదివాసి గూడేలు... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి దూరమయ్యాయని అన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వీర్యమైందని, కానీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఆదివాసీలకు చేరువ చేసేలా కెసిఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసిల విద్యా, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ప్రధానంగా అనేక సీజనల్ వ్యాధులతో ఆదివాసీలు సతమతమవుతున్నారని, కానీ వారికి సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల కారణంగా అనేకమంది మరణించినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని అన్నారు.

ఆదివాసీ పిల్లలకు విద్యను అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలు కుదేలయ్యా యని, దాంతో గురుకులాల్లో చదువుకోవాలంటే విద్యార్థులు భయపడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా గురు కులల్లో విషాహారం తిని విద్యార్థులు మృతి చెందుతున్న కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఐటిడిఏ వ్యవస్థను పటిష్టం చేసి ఆదివాసి బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కనీస ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శించారు. తక్షణమే ఆదివాసీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ హక్కుల కోసం, వారి సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాడు తూనే ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో ఈ నెల 12 నుంచి
# ప్రీమియర్ లీగ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

- మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నవులూరు క్రికెట్ స్టేడియంలో పోటీలు
- నియోజకవర్గ చరిత్రలో లేని విధంగా పెద్ద ఎత్తున క్రికెట్ పోటీలు
- విజేతలకు రూ.3 లక్షలు, రూ. 2 లక్షలు, రూ.లక్ష నగదు బహుమతులు ప్రధానం
- మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కు నగదు బహుమతులు
- మంత్రి నారా లోకేష్ సహకారంతో ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్




మంగళగిరి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో ఈనెల12వ తేదీ నుంచి 23 వరకు మంగళగిరిలో ప్రీమియర్ లీగ్, సిజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో మంత్రి నారా లోకేష్ జన్మ దినోత్స వాన్ని పురస్కరించుకొని ఆయన సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

ఈ సారి నవులూరులో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రీమియర్ లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి 13 టీమ్‌లు, మంగళగిరి నియోజకవర్గం నుండి ఒక జట్టు ప్రీమియర్ లీగ్, సిజన్ -3 పోటీలలో పాల్గొంటున్నాయి. ఇప్పటికే టోర్నమెంట్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు మ్యాచ్ లు నిర్వహిస్తున్నారు.

మంగళగిరి నియోజకవర్గ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు మంత్రి నారా లోకేష్ తన సొంత ఖర్చులతో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ క్రీడాకారుల కోసం ఇప్పటికే తాడేపల్లి, మంగళగిరిలో రెండు క్రీడా మైదానాలను కూడా ఆయన ఏర్పాటు చేశారు. ప్రీమియర్ లీగ్, సిజన్-3 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ 3 లక్షలు, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు, తృతీయ బహుమతి కింద రూ. లక్ష నగదు బహుమతులు ప్రధానం చేయనున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ. 50 వేలు, బెస్ట్ బ్యాట్స్ మెన్ రూ 25 వేలు, బెస్ట్ బౌలర్ రూ 25 వేలు, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పల్నాడులో 'వాటర్ గ్రిడ్'!

- రూ.1200 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం
- ఆన్ లైన్ విధానంలో టెండర్లకు ఆహ్వానం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫలిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి
- సీఎం, డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎంపీ



ప్రకాశం, మహానాడు: పల్నాడు ప్రాంతంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నిర్మించబోయే వాటర్ గ్రిడ్ పథకంలో మరో ముందడుగు పడింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులతో నిర్మించే ఈ జల ప్రాజెక్టుకు రూ.1200 కోట్లతో ఆన్ లైన్ విధానం (ఈ - ప్రొక్యూర్మెంట్) లో టెండర్లకు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల పదోతేదీ నుంచి 24 వరకు మధ్యాహ్నం మూడు గంటల లోపు www.tender.apeprocurement.govt.in ద్వారా టెండర్ లు వేసేందుకు ప్రభుత్వం పిలుపునిచ్చింది.

ఈ ప్రాజెక్టు లో నాగార్జున సాగర్ నుండి నీటిని సేకరించి, దగ్గరలో శుద్ధ జల కేంద్రాన్ని నిర్మించి, నీటిని ఫిల్టర్ చేస్తారు, పైప్ లైన్ ల నిర్మాణం ద్వారా ఈ నీటిని గ్రామాలకు, పట్టణాలకు తరలించి.. ఓవర్ హెడ్ ట్యాంక్ ల్లో నింపుతారు. ఈ నీటిని ఓవర్ హెడ్ ట్యాంక్ ల నుండి ప్రతీ ఇంటికీ సరఫరా చేస్తారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్, అమృత దార ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి ఏర్పాటు ద్వారా నీటిని ప్రతి ఇంటికి అందించే లక్ష్యంతో ఉన్నప్పటికీ బోర్లు వేసినా నీరు పడక కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టు అంతగా ముందుకు సాగటం లేదు,, కానీ వాటర్ గ్రిడ్ పథకం ద్వారా పరిపూర్ణంగా నీటిని అందజేయ వచ్చు. అలాగే ఫ్లోరైడ్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది. దీని నిర్మాణం కోసం 2019 నుంచి టిడిపి ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అవిరామంగా కృషి చేస్తూనే ఉన్నారు. కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు వద్ద ఈ జల ప్రాజెక్టు గురించి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరో ముందడుగు పడి టెండర్లు ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి, సంబంధిత అధికారులకు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ధన్యవాదాలు తెలిపారు.





# సంక్రాంతి పండుగకు ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలు ధరించండి

- చేనేత వస్త్రాలు ధరించి చేనేతను కష్టాల నుండి విముక్తి చేద్దాం
- ఆప్కో షోరూమ్‌ను పరిశీలించిన మంత్రి సవిత

కర్నూలు: నగరంలో ఆప్కో షోరూమ్‌ను కర్నూల్ ఎంపీ నాగరాజు గారితో కలసి తనిఖీ చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మాత్యులు ఎస్.సవిత షోరూమ్‌లోని అన్ని వస్త్రాలను పరిశీలించారు. ఏ యే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అమ్మకాలు రోజూ ఏ మేర జరుగుతున్నాయని ఆరా తీశారు. ఏ వ్యాపారిని కైనా కస్టమర్లే దేవుళ్లని, వాళ్లతో హుందాగా వ్యవహరించాలని అక్కడి సిబ్బందికి మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

సంక్రాంతి పండుగకు ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత తెలిపారు.

చేనేత వస్త్రాలు ధరించి చేనేతను కష్టాల నుండి విముక్తి చేద్దాంమని ఎంపీ నాగరాజు తెలియచేశారు .ఈ సందర్భంగా షో రూమ్ లో చేనేత వస్త్రాలును కొన్న ఎంపీ నాగరాజు. ఈ కార్యక్రమంలో అధికారులు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు

## - ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు, మహానాడు: తెలుగుదేశం పార్టీకి బీసీలు అండగా నిలుస్తున్నారని, బీసీల పక్షపాత ప్రభుత్వంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిలిచిపోతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధులు "వడ్డే ఓబన్న" జయంతిని ప్రభుత్వం తరపున అధికారిక వేడుకగా జరిపేందుకు జీఓ ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేశారు. బీసీవడ్డెర నేతలతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లె ఈశ్వర్ , వడ్డే వెంకట్, చంద్రగిరి బాబు, బత్తులజాన్ సైదా, చంబేటి మణికుమారి, మల్లె అయ్యప్ప, ఓర్సుశీను పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే

మొదటి పేజీ తరువాయి..



సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలి. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలి. కలెక్టర్లు ఇందిరమ్మ అర్హుల జాబితాను ఇంచార్జి మినిస్టర్ కు అందించాలి. ఇంచార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలి. జనవరి 26 న అత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం. ఇందుకు సంబంధించి పక డ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుం దని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలి. ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలి. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్ కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండి. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి. జనవరి 26 తరువాత నేను ఆకస్మిక తనిఖీలు చేస్తా. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవు.

# నిర్మాణరంగాన్ని నిలబెడతాం

మొదటి పేజీ తరువాయి..

నిర్మాణ రంగమైతే గత ఐదేళ్లు అడ్రస్ లేకుండా పోయింది. అందుకే ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చాం. ప్రజలు మమ్మల్ని నమ్మి 93 శాతం స్ట్రైక్ రేట్, 53 శాతం ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభించాం. గత ఐదేళ్లు ఎటు చూసినా అంధకారం...విధ్వసమే కనబడింది. ఇప్పటికీ సమస్యలు ఉన్నాయి. మొన్ననే రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ప్రధాని మోదీ రూ.2.8 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, పెట్టుబడులకు శంకుస్థానలు, ప్రారంభోత్సవాలు చేశారు. బ్రాండ్ ఏపీ ఇమేజ్‌తో ఇప్పుడిప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి.

### వ్యవసాయం, పర్యాటకం ఊపందుకోవాలి

'రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి, వ్యవసాయం లాభసాటి కావాలి, పర్యాటకం ఊపందుకోవాలి, సంపద పెరగాలి.. అప్పుడే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు నిర్మాణ రంగంపై ఆధారపడ్డాయి. గత ఐదేళ్లు ఇసుక లభించక భవన నిర్మాణ రంగం కార్మికులకు సరైన ఉపాధి ఉండేది కాదు. మా ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టాం. ఇసుక కొరత లేకుండా చేశాం. ఎవరైనా ఇసుక లభ్యం కాకపోతే.. గట్టిగా అడిగే హక్కు ఈ ప్రభుత్వం ఇచ్చింది. నరెడ్కో సంస్థ అంచలంచెలుగా ఎదిగింది. రియలెస్టేట్ రంగం వాటా జీడీపీలో 7.3 శాతం ఉంది. 2047కు 20 శాతం పెరిగి, 5.8 ట్రిలియన్ డాలర్లు ఆర్జిస్తుంది. అన్ని రంగాలు అభివృద్ధి చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

నాగరిక సమాజంలో నిర్మాణం అనేది నిత్యం జరుగుతూనే ఉంటుంది. అమరావతి అభివృద్ధి జరిగి ఉంటే ఈ ప్రాంతం మరింత నిలదొక్కుకుని ఉండేది. కానీ ఐదేళ్లు నిర్వీర్యం చేసి రాష్ట్రంలో నిర్మాణాన్ని నిలదొక్కకోకుండా చేశారు. కూల్చివేతలతో భయభ్రాంతులకు గురి చేయడంతో నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతింది. నిర్మాణ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చాం. నా జీవితంలో ఎప్పుడూ చూడని విధంగా










భూ సమస్యలు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రికార్డులు తారుమారు చేసి భూకబ్జాలకు పాల్పడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ఇష్టానుసారంగా చేయాలని చూశారు. అందుకే అధికారంలోకి వచ్చాక రద్దు చేసి, యాంటీ ల్యాడ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చాం.

### టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలిపెట్టం

'టీడీఆర్ బాండ్లలో డబ్బులు తీసుకుంది ఒకరు... నష్టపోయింది ఇంకొకరు. దీన్ని కూడా గత పాలకులు అక్రమాలకు వాడుకున్నారు. అవినీతికి పాల్పడ్డవారిని వదలిపెట్టం... అమాయకుల్ని కాపాడతాం. 7 నెలల్లో రాష్ట్రంలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి పనులు ప్రారంభిస్తున్నాం. తద్వారా 4 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తాం. ఇది స్వయం ఆధారిత ప్రాజెక్టు. రియల్ ఎస్టేట్ ఎక్కడ బాగుంటుందో అక్కడ సంపద సృష్టి జరుగుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కి.మీ మేర రింగ్ రోడ్డుకు ప్లాన్ సిద్ధం చేశాం. అది పూర్తయితే గుంటూరు-అమరావతి పట్టణాలు కలిసిపోతాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాం. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చుతాం.

### అవకాశాలన్ని అందుకోవడంలో 'గుంటూరు' ముందు

'ఐటీని అందిపుచ్చుకుని విదేశాలకు వెళ్లిన వారిలో గుంటూరు వాసులు ఎక్కువ. అందరికంటే ముందుండే అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ఇతర దేశాల్లో మాదిరి రాష్ట్రంలోనూ స్వచ్ఛమైన వాతావరణాన్ని సృష్టిస్తాం. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను గతంలో గుంటూరులో ఏర్పాటు చేశాం. అది బ్రహ్మాండంగా పని చేస్తోంది. ఇక ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అభివృద్ధి, సుపరిపాలన ప్రభుత్వం చేస్తుంది... వాటిని మీరు ముందుకు తీసుకెళ్లాలి. నిర్మాణ రంగంలో మన రాష్ట్రాన్ని మించిన పాలసీ ఉండదు. వీలైనన్ని నిబంధనలు సరళతరం చేశాం.

రాబోయే రెండు నెల్లలో డ్యాష్ బోర్డు తెస్తాం. మీరు తెచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తాం. నిర్ణీత సమయానికే అనుమతులు ఇస్తాం... ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకుంటాం. మీరు కూడా ఎక్కడా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలి. ఇప్పటిదాకా నిదానించిన నిర్మాణరంగాన్ని నిలబెడుతున్నాం.. ఇంకా మీరే నడవాలి... పరుగెత్తాలి. గతాన్ని మర్చిపోండి. నిర్మాణ రంగంలోనూ నూతన ఆవిష్కరణలు వచ్చాయి. వాటిని ఉపయోగించుకుంటే రూ.500 సంపాదించేవాళ్లు రూ.1,500 సంపాదించవచ్చు.

### దేశంలో అమరావతి లాంటి కొత్తనగరం రాదు

'దేశంలో అమరావతి లాంటి నగరం మరొకటి రాదు. కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తాం. ఒక్క అమరావతినే కాదు విశాఖ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి లాంటి పట్టణాలను అభివృద్ధి చేస్తాం. భవిష్యత్తులో పట్టణాభివృద్ధి జరిగి మన నగరాలు కూడా అగ్రస్థానంలో ఉండాలి. అనధికారిక నిర్మాణాలు చేపట్టవద్దు. ఇసుకను ఉచితంగా ఇస్తాం. ఎక్కడా ఇసుక అక్రమ రవాణాను అనుమతించం. దీనిపై ఇప్పటికే కలెక్టర్ల, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చాం. అధికారులు తప్పు చేసినా క్షమించను.' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

07

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 ||

# శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు

### ఆశీస్సులు అందుకున్న డాక్టర్ లక్ష్మి, లలిత్ సాగర్



**దర్శి, మహానాడు:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం దర్శి మండలం, వెంకటాచలంపల్లి లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. దర్శి ప్రాంతం, రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని వారు వేడుకున్నారు.

**గోకుల్ షెడ్ ప్రారంభం:** దర్శి మండలం బసిరెడ్డి పల్లెలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం గోకుల్ షెడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్నదాత అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంజీఎన్ఆర్ఈజీఏ అధికారులు, తదితరులు ఉన్నారు.



## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్, మహానాడు:** తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీచేసే అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం ప్రకటించారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పులి సరోత్తం రెడ్డి, కరీంనగర్-నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మల్కా కొమరయ్య (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) కరీంనగర్- నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్ర అభ్యర్థిగా సి.అంజిరెడ్డిని ప్రకటించారు.

## జగనన్న కాలనీల పేరు మార్పు

- ఇక నుంచి పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్

**అమరావతి:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పలు పథకాలకు పేర్లను మారుస్తూ వస్తోంది. తాజాగా ఏపీలో జగనన్న కాలనీలను ఇక నుంచి పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్‌లుగా పేరు మారుస్తూ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జగనన్న కాలనీల పేరు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


**ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురజాల, మాచర్ల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.**



## ప్రజల సంతోషమే దేవుడిని కోరుకున్నాం..

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** పల్నాడు ప్రాంతం, రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని, ప్రజలు సంతోషంగా ఉండాలనే తాను ఎప్పుడూ ఆ భగవంతుడుని కోరుకుంటానని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రజలందరూ బాగుండి మన సంస్కృతి, సంప్రదాయాలను



ముందుకు తీసుకెళ్లాలన్నదే తన ప్రార్థనగా ఉంటుందన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయానికి వెళ్లి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు జీవీ, మక్కెనకు స్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ముక్కోటి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అంబటి రాంబాబు, మురళీపై కేసు!

**నగరం పాలెం, మహానాడు:** భజరంగ్ జ్యూట్ మిల్లు స్థలం అంబటి రాంబాబు, అతని తమ్ముడు మురళీకి సెల్ డీడ్ జరిగిందని దాని రద్దు చేయాలని హైకోర్టు లో కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావు పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని తనను బెదిరించారని బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలతో ఇద్దరిపై నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

## అన్న క్యాంటీన్ల కోసం రూ.10 లక్షల విరాళం

- మంత్రి లోకేష్‌ను కలిసి చెక్ అందజేసిన మాదాల శ్రీరామ్ భాస్కర్



**ఉండవల్లి, మహానాడు:** పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. గుంటూరుకు చెందిన మాదాల శ్రీరామ్ భాస్కర్ ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసి అన్న క్యాంటీన్లకు రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్‌ను మంత్రి నారా లోకేష్‌కు అందించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లకు చేయూత అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీరామ్ భాస్కర్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

## గుడివాడ "తులసీ'దళం!







ఇప్పుడు గుడివాడ తులసిబాబు ఆనాడు ఓం ప్రకాష్ అవలంబించిన విధానాన్నే అమలు చేసాడు. ఇది కూడా జగన్ మోడస్ ఆపరెండీయే. రఘురామను చిత్రహింసలు పెట్టిన కేసులో భారీకాయుడు పాత్రపోషించి రఘురామ ను హత్య చేసేందుకు గుండెల మీద కూర్చుని తీవ్రంగా హింసించి న వాడు ఈ గుడివాడ తులసి బాబు.

ఆనాటి సిఐడి ఛీఫ్ కి దగ్గరివాడు, కొడాలి సంకలో ఉన్నట్లుగా చెప్పబడుతున్న ఈ తులసిబాబు, ఇప్పుడు పదుల సంఖ్యలో కార్లతో భారీ ర్యాలీతో గుడివాడ నుండి ఒంగోలు ఎస్పి కార్యాలయానికి విచారణకు రావడం.. అది కూడా అన్న ఎన్టీఆర్, మన చంద్రన్న ఫోటోలతో, బ్యానర్లతో, నినాదాలతో హల్ చల్ చేయడం, వందశాతం తెదేపా చేతకానితనమే. అతగాడేదో సేవా కార్యక్రమాలకు వెళుతున్నట్లు, తులసీదళం పేరుతో దళాన్ని ఏర్పాటు చేసుకుని భారీ ర్యాలీతో వెళ్ళడం.. అది కూడా తెదేపా రంగుపులుముకోవడం పార్టీ చేతకానితనాన్ని.. పార్టీ లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతుంది.

పరిటాల రవన్నని హతమార్చిన ప్రధాన నిందితుడు మొద్దుశీను ని హతమార్చిన ఓం ప్రకాష్ కూడా ఇదే తరహా ఎత్తుగడ వినియోగించాడు. కడప జైలులో మొద్దుశీను ను హతమార్చి, ఆ ఉదయం కోడెల శిష్యుడని అని బిగ్గరగా తెలుగుదేశం జిందాబాద్, కోడెల జిందాబాద్ అంటూ అరవడంతో, తెదేపా నాయకులకు పంచెలు తడిచిపోయాయి. మొద్దుశీను ని హత్య చేసిన విషయం పక్కదారి పట్టింది.

ఇప్పుడు కూడా అదేవిధానం జగన్ బ్యాచ్ ఫాలో అవుతుంది. పివి సునీల్ ఆధ్వర్యంలో జరిగిన అక్రమ అరెస్టుల బాగోతాలకు ఈ తులసీబాబే ముఖ్యుడు. ఈ అక్రమ అరెస్టుల్లో మన అధినేతే స్వయానా ప్రధాన బాధితుడు కదా? మన రఘురామ కూడా బాధితుడే కదా? అదే వైఎస్ జమానాలో అధికారం లోకి రాగానే పరిటాలను వేసేసారు.

ఆ తర్వాత సాక్షులను, చేసిన వాళ్ల ని లేపేసారు. ఆరోజు ఈరోజు ఉన్నది అదే యంత్రాంగం. మరి మన బాబు ఎందుకు సక్రమంగా ఉపయోగించ లేకపోతున్నారు? ఈయనా రాయలసీమ బిడ్డే కదా? ఇవ్వాళ డాక్టర్ ప్రభావతి కి కూడా ముందస్తు బెయిలు హైకోర్టు నిరాకరించింది. విజయపాల్ కి సుప్రీంకోర్టు నిరాకరించిన తరువాత అరెస్టు చేశారు. ఈ రెండు తీర్పుల తో మిగతా అందరినీ ఈ క్షణంలో లోన వేయవచ్చు. మరి మన చంద్రన్న ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కాదు.

ఇప్పుడు గుడివాడ తులసిబాబు ఆనాడు ఓం ప్రకాష్ అవలంబించిన విధానాన్నే అమలు చేసాడు. మన ఇంటిలిజన్స్ వ్యవస్థ ఏం చేస్తుంది? మరో పక్క పదకొండు సీట్ల తో జగనే మనకంటే ఎక్కువ అరుస్తున్నాడు. ఈ తిరుపతి ఘటన తో మరింత బలపడుతున్నది వాస్తవం. సంక్రాంతి తరువాత ప్రజలలోకి వెళతాడట.

మరి మన పార్టీ అసలు ఆలోచిస్తుందా? ఎవడికి కావాలి ఈ శాంతి వచనాలు? మీరు నిన్న మోడీతో రెండు లక్షల కోట్లు తెచ్చారు. జగన్ ఐదేళ్ళ లో కనీసం మాట మాట్లాడలేదు. అయినా జగన్ కీ నలభైశాతం ఓట్లు వచ్చాయి. మరి మీరెందుకు గుడ్డలు చించుకుంటారు? దుష్టశిక్షణ చేయరు? జగన్ ప్రతీ మాటకు మీరే బాధ్యులు. మా తరం పోయాక.. మీ మాట మేము విన్నట్లు వినరు ఇప్పటి యువత. మరి ఆలోచించండి.

**-ఉప్పలపాటి ఆంజనేయ వర ప్రసాద్**

**( న్యాయవాది, చెన్నయ్)**

## ప్రజల్ని ఓట్లు అడిగాను కాబట్టే.. తప్పు జరిగినప్పుడు బాధ్యతగా క్షమాపణ కోరా

మొదటి పేజీ తరువాయి..

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు.

### తిరుపతి ఘటన బాధాకరం...

### చైర్మన్, ఈవో, అదనపు ఈవోలు క్షమాపణలు చెప్పాలి

సంక్రాంతి ముందు తిరుపతిలో వైకుంఠ ద్వారా దర్శన టిక్కెట్లు ఇచ్చే సమయంలో జరిగిన తోపులాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరం. కూటమి ప్రభుత్వంలో తొలి సంక్రాంతికి ఇలాంటి ఘటన నన్ను కలచివేసింది. ఎన్డీయే ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఓట్లేశారు. ఇలాంటి దుర్ఘటన జరిగినపుడు ఎవరో ఒకరు మీద మొత్తం నెపం నెట్టేసి తప్పించుకునే వాడిని కాదు. అందుకే ప్రజలను మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరాను.

ప్రభుత్వంలో ఎవరు తప్పు చేసినా బాధ్యత వహించాల్సిన స్థానంలో ఉన్నాను కాబట్టే హిందుత్వం ఆచరించే శ్రీవారి భక్తులంతా ఈ దుర్ఘటన విషయంలో క్షమించాలని వేడుకున్నాను. తిరుపతి తొక్కిసలాట విషయంలో టీటీడీ చైర్మన్, టీటీడీ ఈవో, టీటీడీ అదనపు ఈవో, పాలక మండలి లు కూడా ప్రజలను మీడియా ముందు బేషరతుగా క్షమాపణ కోరాల్సిందే.

ప్రజలు మా మీద ఎంతో నమ్మకం పెట్టి కూటమిని గెలిపించారు. కూటమి వచ్చింది కాబట్టే ప్రస్తుత టీటీడీ చైర్మన్ గా బి.ఆర్.నాయుడు, ఈవోగా శ్యామలరావు, అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి కొండపై విధులు నిర్వర్తిస్తున్నారు. కీలకమైన సమయంలో ఎలాంటి బేషజాలకు పోకుండా ప్రజలను క్షమాపణ అడిగితే తప్పేం లేదు. నాకు ఘటనకు ఎలాంటి సంబంధం లేకున్నా, నేను బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాను కాబట్టే మనస్ఫూర్తిగా క్షమాపణలు అడిగాను. తిరుపతి ఘటనలో డీఎస్పీ చేసిన తప్పిదానికి ఎస్పీ బదిలీ కావల్సి వచ్చింది. ఓ ఘటన జరిగినపుడు నైతిక బాధ్యత వహించడం ప్రధానం. తిరుపతి దుర్ఘటనలో క్రౌడ్ మేనేజ్ మెంట్ సరిగా లేదని తెలుస్తోంది. బ్రహ్మోత్సవాల సమయంలో గరుడ సేవల రోజు సుమారు 4 లక్షల మంది కొండకు వస్తారు. అలాంటపుడు పాటించే క్రౌడ్ మేనేజ్ మెంట్ ఇప్పుడు పాటించలేదని అర్థం అవుతోంది. ఈ సమయంలో టీటీడీ చైర్మన్ , ఈవో, అదనపు ఈవోలు బాధ్యత తీసుకోవాల్సిందే. అందుకు నామోషీ పడాల్సిన అవసరం లేదు. క్షమాపణలు చెప్పడం వల్ల ప్రాణాలు తిరిగి రాకున్నా, ప్రజల ముందు జరిగిన తప్పుకు బాధ్యత తీసుకోవడం హుందా అనిపించుకుంటుంది.

యువత కూడా నేను వచ్చినపుడు కేరింతలు, అరుపులు మానాలి. దేనికోసం వచ్చామో, ఈ పరిస్థితుల్లో ఉన్నామో ఆలోచించి అరవండి. ఒక్కోసారి యువత అరుపులు చాలా కోపాన్ని కలిగిస్తాయి. వచ్చిన పరిస్థితికి తగ్గట్టుగా బాధ్యతగా అంతా నడుచుకోవాలి.

### సామాన్యుల సేవ ముఖ్యం

అధికారులు వీఐపీ ట్రీట్మెంట్ లను నిలువరించాలి. టీటీడీలో అయినా బయట అయినా ఈ ట్రీట్మెంట్ ఉండకూడదు. రాష్ట్రాభివృద్ధికి అధికారులు తగిన సహకారం అందించాలి. చాలామంది అధికారుల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వీడటం లేదు. నాకు అధికారులంటే అమితమైన గౌరవం ఉంటుంది. దాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులకు ఉంటుంది. 6 నెలల హనీమూన్ పిరియడ్ నాతో సహా అందరికీ అయిపోయింది. ఇకనైనా అధికార యంత్రాంగంలో మార్పు రావాలి. వ్యక్తిగత ఇష్టాలు, అభిరుచులు ఉంటే వాటిని




మనసులోనే ఉంచుకోండి. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సేవ చేయడం మరువకండి.

ప్రజలు కట్టే పన్నుతో మనం బతుకుతున్నాం... వారికి సేవ చేసేందుకు విధుల్లో ఉన్నాము అని గుర్తుంచుకోవాలి. ఎవరు తప్పు చేసినా ఒకే న్యాయం అవసరం. తప్పు చేసిన వాడికి కులం, మతం అడ్డు రాకూడదు. ప్రజాప్రతినిధులకు అదే సూత్రం వర్తిస్తుంది

పాడి రైతులకు ఎంతో అవసరం అయ్యే గోకులాలను గత అయిదేళ్ల పాలనలో కేవలం 268 నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం 6 నెలల్లోనే 12,500 నిర్మించి పాడి రైతులకు అండగా నిలిచిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాజకీయం అంటే ఓట్ల కోసం బుగ్గలు నిమరడం, ముద్దులు పెట్టడం కాదు... కష్టంలో ఉన్నవారికి అండగా నిలబడటం, వారికి వృద్ధిలో తోడ్పాటునందించడమే నిజమైన రాజకీయం అన్నారు. పల్లె పండుగ %-% పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 12,500 గోకులాలను ఒకే రోజు ప్రారంభించే కార్యక్రమాన్ని శుక్రవారం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా పిఠాపురం పాతబస్టాండు వద్ద ఉన్న



మున్సిపల్ పాఠశాలలో జరిగిన సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "నాకు స్వచ్ఛంగా రాజకీయాలు చేయడమే తెలుసు. మండల పరిషత్ అధికారి మీద దాడి జరిగితే ఆయనది ఏ కులం.. ఏ ప్రాంతం అని చూడకుండానే పరామర్శకు వెళ్లాను. ఓ ప్రభుత్వ అధికారి కొడుకుగా ఈ రాష్ట్ర ప్రజలు పన్నులు కట్టిన జీతం సొమ్మును తిని పెరిగిన వ్యక్తిగా ఏ ప్రభుత్వ అధికారిపై, సిబ్బందిపై దాడి జరిగినా ఇలాగే స్పందించేవాడిని. ప్రభుత్వ అధికారుల మీద దాడి జరిగితే మా నాన్న మీద జరిగిన దాడిగానే దాన్ని భావిస్తాను.

అరాచక పాలన నుంచి విముక్తి అయిన రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి నిబద్ధతతో పని చేయాలనే తలంపుతోనే ముందుకు వెళ్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా సరైన రోడ్లు లేక, డోలీల్లో వైద్యసేవలకు తీసుకెళ్తూ నరకయాతన పడుతున్న గిరిజనుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకే కొండల్లో తిరిగాను. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు అని తెలిసినా, హెచ్చరికలు ఉన్నా తెగించి కొండల్లో నడవడం వెనుక అక్కడి ప్రజల బాధలను స్వయంగా తెలుసుకోవాలన్న తపన, వేదన నాలో ఉన్నాయి.

కాబట్టే మారుమూల కుగ్రామాలకు సైతం వెళ్తున్నాను. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న పరిస్థితుల్లో గిరిజన గ్రామాలకు రోడ్లు వేసేందుకు అప్పటికప్పుడు రూ.39 కోట్లు ముఖ్యమంత్రి పెద్ద హృదయంతో అందించడం సంతోషకరం. రూ.500 కోట్లు వెచ్చించి ప్యాలెస్ లు కట్టుకున్న వారికి, రూ.2 కోట్లతో బాత్ రూంలు నిర్మించుకున్న వారికి, గిరిజనులు కష్టాలేం తెలుస్తాయి..?

### న్యూజిలాండ్ తరహాలో పాడి రైతులు ఎదగాలి

వైసీపీ పాలనలో సొంత డెయిరీలను, కొన్ని ప్రత్యేక డెయిరీలను ప్రోత్సహించారు. కనీసం పాడిరైతును పట్టించుకున్న దాఖలాలు లేవు. గోకులాలు నిర్మిస్తే పశువులు పరిశుభ్రమైన వాతావరణంలో ఉంటే పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని తెలిసినా వైసీపీ నాయకులకు అవేవీ పట్టలేదు. ఇప్పుడు నిర్మించిన గోకులాలతో చిన్నస్థాయి పాడి రైతులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఆదాయం పెరుగుతుంది.

గుజరాత్ లో మహిళలు శ్వేత విప్లవం ద్వారా రూ.60 వేల కోట్ల ఆదాయం అర్జించారు. ప్రపంచంలోనే న్యూజిలాండ్ పాడి విప్లవంతో సరికొత్త పంథాలో ముందుకు వెళ్తోంది. రాష్ట్రంలోనూ పాడి రైతులకు ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుంది. వారికి అన్ని విధాలా సహకరిస్తాం. న్యూజిలాండ్ తరహాలో పాడి రైతులు అత్యున్నతంగా ఎదగాలి అన్నదే నా ఆకాంక్ష.

90 శాతం రాయితీతో నరేగా నిధులతో గోకులాలు సరికొత్తగా రూపుదిద్దుకుంటున్నాయి. అతి తక్కువ కాలంలోనే గోకులాలను సుందరంగా నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చాం. గత ప్రభుత్వం స్కాంలలో రికార్డులు సృష్టిస్తే, కూటమి ప్రభుత్వం స్కీంలు, అభివృద్ధిలో రికార్డులు సృష్టిస్తోంది. గట్టిగా పని చేస్తే డబ్బులు అవే వస్తాయి. ప్రజల కోసం శ్రమ చేస్తే పెట్టుబడులు అవే వస్తాయి. వైసీపీ పాలనలో పాడి పరిశ్రమలపై ఆ పార్టీ నాయకులు గుత్తాధిపత్యం చేశారు. అమూల్ డెయిరీకు మొత్తం ఆస్తులను రాసిచ్చారు. మేం పాడి రైతుకు అండగా నిలిచేందుకు మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం.

### ఉపాధి హామీలో కొత్త విధానాలు

రాష్ట్రంలోని 97 లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు ఎన్నడూ లేనట్లుగా వేతనాలను సకాలంలో చెల్లిస్తున్నాం. రూ.5,193 కోట్ల వేతనాలను సకాలంలో చెల్లించాం. కేవలం రూ.2 కోట్లు మాత్రమే వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సుస్థిరమైన ఆదాయం, మౌలిక వసతులు కల్పనకు ఉపాధి పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నాం. పల్లె పండుగలో గ్రామాల్లో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాలతో పాటు దొంగ మస్టర్ల నిరోధానికి నూతన యాజమాన్య పద్ధతిని అవలంభిస్తున్నాం. ఫ్లైయింగ్ స్క్వాడ్ లు నిరంతరం నిఘా పెడతాయి. నాణ్యత, జవాబుదారీతనం అందించే విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదు.

ఇక నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల్ల పర్యటిస్తాను. నించున్న దగ్గర సమీక్ష ఉంటుంది. అక్కడి నుంచే ఆదేశాలు వెళ్తాయి. దానిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత పాలన యంత్రాంగంపై




ఉంటుంది. నేను పని చేసి మాత్రమే ప్రజలను ఓట్లు అడుగుతాను. 15 ఏళ్లు తక్కువ కాకుండా కూటమి ప్రభుత్వం ఉండాలని బలంగా విశ్వసిస్తున్నాను. నాకు అధికారం అలంకారం కాదు... అదో బృహత్తర బాధ్యత. ప్రజల కోసం ఒళ్లు వంచి పనిచేస్తాను.

### అమ్మాయిలను వేధిస్తే తొక్కి నార తీయండి

పిఠాపురం నియోజవర్గం నుంచి వచ్చే పలు సమస్యలు నా దృష్టికి వస్తున్నాయి. అధికారులు వాటి పరిష్కారంపై మీద దృష్టి సారించాలి. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు దృష్టి సారించాలి. పిఠాపురంలోని అగ్రహారం, రథాల వీధి, ఇందిరా నగర్ తదితర చోట్ల గంజాయి వాడకం ఎక్కువైంది. గత నెలలో ఎస్సీ బాయ్స్ వెల్ఫేర్ హాస్టల్ లోకి చొరబడి విద్యార్థులను బెదిరించి డబ్బులు గుంజుకున్నట్లు తెలిసింది.

ఈ నెల 2వ తేదీన బెదిరించి ఓ వ్యక్తి దగ్గర నుంచి బంగారు గొలుసు దోచుకున్నట్లు తెలిసింది. ఈవ్ టీజింగ్ పెరిగినట్లు సమాచారం వచ్చింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర బైక్స్ మీద రౌండ్స్ కొడుతూ అమ్మాయిలను ఇబ్బందిపెడుతున్నారు అని కాలేజీ ప్రిన్సిపాల్ పోలీసులకీ తెలిపారు. ప్రైవేట్ కాలేజీలు దగ్గర, బస్టాండు ప్రాంతాల్లో యువతులపై ఈవ్ టీజింగ్ ఎక్కువ అయిందని తెలుస్తోంది. దీనిపై పోలీసులు దృష్టి సారించాలి. తక్షణం అరికట్టాలి. అమ్మాయిలను వేధించడం మగతనం కాదు. దేశ సేవ కోసం సైన్యంలో చేరితే మగతనం. క్రీడల్లో రాణించండి. అమ్మాయిలను, మహిళల్ని ఇబ్బందిపెట్టి వేధిస్తే తొక్కి నార తీయండి.

పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతున్నాను. కొన్ని సమస్యలు లీగల్ గా వచ్చే ఇబ్బందులతో మిగిలిపోతున్నాయి. నేను ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాను. నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాను. ఇంకా నా మీద ఆరోపణలు, అసత్యాలు మాట్లాడితే నేనేం చేయలేను. ప్రతి జిల్లాకు వెళ్లి కొన్ని రోజులపాటు జిల్లాలోనే ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించుకున్నా.

మొదట నా సొంత నియోజకవర్గం చక్కబెట్టుకున్న తర్వాతే రాష్ట్రమంతటా తిరగడానికి ఇక్కడికి వచ్చాను. 14 రోజులపాటు




ఇక్కడే ఉండి ప్రతి గ్రామ సమస్య పరిష్కరిస్తాను. నేను ప్రేమకు ప్రేమ, ద్వేషానికి ద్వేషం.. దేనికైనా సిద్ధంగానే ఉన్నాను. తుపాకీ విడిచిన ఓ విప్లవకారుడు ఓటును నమ్మి జనంలోకి వస్తే ఎలా పాలిస్తాడో అదే విధంగా నేను ముందుకు వెళ్తాను" అన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 11, జనవరి 2025 ||



# 'పోలవరం' పరిశీలన బృందానికి ఘన స్వాగతం





**రాజమహేంద్రవరం, మహానాడు:** పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి శనివారం పరిశీలన నిమిత్తం చైర్‌పర్సన్ రాజీవ్ ప్రతాప్ రూడీ నేతృత్వం లోని కేంద్ర నీటి వనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శుక్రవారం విచ్చేసింది. వీరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, తూర్పు గోదావరి కలెక్టర్ పి.ప్రశాంతి స్థానిక మధురపూడి విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం పలకారు. అనంతరం బృంద సభ్యులతో కలిసి స్థానికంగా రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విడిది కి చేరుకున్నారు.

కమిటీ సభ్యులకు స్వాగతం పలికిన వారిలో ఇరిగేషన్ ఈ ఎన్ సి ఎం.వెంకటేశ్వర రావు, ఇతర అధికారులు ఉన్నారు. బృందంలో రాజ్యసభ సభ్యులు ఖిరు మహ్తో, ధర్మశీల గుప్తా, లోక్ సభ సభ్యులు రీ షేర్ సింగ్ ఘుబాయా, రోడ్మల్ నగర్, జోయంత బసుమతరీ, నారాయణ్ దాస్ అహిర్వార్, సంజ్ఞ జాతవ్, సాగర్ ఈశ్వర్ ఖంద్రే, విశాల్ (దాదా) ప్రకాష్బాపు పాటిల్, మోహితే-పాటిల్ ధైర్యశీల్ రాజ్‌సిన్హ్ లు ఉన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్ వైకుంఠపురం శ్రీ పద్మావతి లక్ష్మి సమేత వెంకటేశ్వర దేవస్థానంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ని పూర్ణ కుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు అధికారులు.



మంత్రి నారా లోకేష్‌ని శుక్రవారం కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతి పత్రాలు అందించిన పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్

# మన్యంలో 'ఆరోగ్య రథం'

- రూ. కోటి తో రెండు రథాలు ఏర్పాటు
- మైనింగ్ ప్రాంతాల్లో సేవలు
- ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

**తాడిగడప, మహానాడు:** మైనింగ్ అధికంగా జరిగే అరకు, పాడేరు ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ ల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయం తాడిగడపలో ఆరోగ్య రథం వాహనాలను మంత్రి



కొల్లు రవీంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ బస్సులు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2017 లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో రూ. 17 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఆరోగ్య రథాలను తీసుకువచ్చామన్నారు. ఇప్పటికే ఏపీఎండీసీ ద్వారా ఆరోగ్య సేవలు, విద్యాలయాలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు కోటి రూపాయల వ్యయంతో పూర్తి సాంకేతికత కలిగిన రెండు వాహనాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు.

వీటి ద్వారా ఆరోగ్య సేవలతో పాటు హెల్త్ చెకప్, కార్డియో, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర సేవలు అందిస్తారన్నారు. 2019-24 మధ్య కాలం లో రాష్ట్రంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ ను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ కనీసం ప్రజల ఆరోగ్యంపై పెట్టిన దాఖలాలు లేకుండా పోయాయన్నారు. భవిష్యత్తులో ఎక్కడ అవసరం ఉన్నా ఈ సేవలను కొనసాగిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

తొలుత ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్ తో కలిసి రెండు ఆరోగ్య రథం వాహనాలను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్సులో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపించుకుంది. ఈ వాహనంలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, డ్రైవర్, ఫార్మసిస్ట్ ఉంటారు, వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలలో 24 రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఆరోగ్య సేవలు ప్రజలకు అందిస్తారు.

# పిఠాపురంలో మినీ గోకులాలు!

- ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రైతు శ్రీ యాతం నాగేశ్వరరావుకి గోవులు పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 12,500 గోకులాలకు లాంఛనంగా ప్రారంభోత్సవం
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో అతి తక్కువ సమయంలో గోకులాల నిర్మాణం

**పిఠాపురం, మహానాడు:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం, కుమారపురంలో మినీ గోకులాన్ని ప్రాంభించారు. శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన ఈ గోకులాన్ని ప్రారంభించి



రైతుయాతం నాగేశ్వరరావుకి అందజేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రూ.1.85 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. మినీ గోకులాన్ని ప్రారంభించి నాలుగు గోవులను రైతుకి అందజేశారు. ఇదే వేదిక నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను లాంఛనంగా ప్రారంభించారు. అతి తక్కువ సమయంలో భారీ సంఖ్యలో గోకులాల నిర్మాణం పూర్తి చేసి రికార్డు సృష్టించారు. కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా కుమారపురం మినీ గోకులాన్ని ప్రారంభించిన పవన్ గోమాతను పూజించి, పశుగ్రాసాన్ని



అందించారు. అనంతరం గోకులం నిర్మాణ శైలిని పరిశీలించారు. గోకులం షెడ్లలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులను పశు సంవర్ధక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు అందిస్తున్న సదుపాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. పశువులకు అందిస్తున్న దాణా, అందుబాటులో ఉన్న పశుగ్రాసం వంగడాలు, పశుగణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఈ చిత్ర ప్రదర్శన ద్వారా క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పోస్టర్ ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ శ్రీ షణ్మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం నియోజకవర్గం జనసేన,టీడీపీ, బీజేపీ ఇంఛార్జులు మర్రెడ్డి శ్రీనివాస్, ఎస్వీఎస్ఎన్ వర్మ, కృష్ణంరాజు ఇతర ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# కడప డీఈఓ అసంబద్ధ నిర్ణయాలతో టీచర్లకు ఇబ్బందులు

- న్యాయం చేయాలని విన్నవించుకున్న పలువురు ఉపాధ్యాయులు
- వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారులు
- వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేసిన పల్లా శ్రీనివాసరావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

**మంగళగిరి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలు అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలువురు నిరుద్యోగులు



ఉద్యోగాలు కల్పించాలంటూ అర్జీలు ఇచ్చి అభ్యర్థించగా... ఆరోగ్య సమస్యలపై ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటూ మరికొందరు వేడుకున్నారు. అలాగే భూ సమస్యలపై బాధితులు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

- తన మామ మరణించడంతో ఆ ఇంటిని మరొకరు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని.. ఇళ్లు ఆక్రమించుకున్న చిల్కా ఆదాము, జయపాల్ ను ఇళ్లు ఖాళీ చేయించి తనకు ఇల్లు దక్కేలాచూడాలని గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం కొర్నెపాడుకు చెందిన చిల్కా సత్యప్రేమ లీలా విజ్ఞప్తి చేశారు.
- అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం గ్యారంపల్లికస్పా గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాసులు విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి వీఆర్ఏగా పనిచేస్తూ మరణించడంతో ఆ ఉద్యోగం తన చెల్లికి ఇచ్చారని.. తమ కుటుంబం టీడీపీ వైపు ఉందని.. తన చెల్లి వీఆర్ఏ ఉద్యోగాన్ని గత ప్రభుత్వంలో తొలగించారని.. అంతే కాకుండా తిరుమలలో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్న తన ఉద్యోగం కూడా తొలగించి ఇబ్బంది పెట్టారని.. దయ చేసి కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తన చెల్లికి తొలగించిన వీఆర్ఏ ఉద్యోగాన్ని తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాడు.
- కర్నూలు జిల్లా కౌతాళం మండలం హల్వి గ్రామానికి చెందిన ముదుకప్ప విజ్ఞప్తి చేస్తూ.. తాత ముత్తాతల నుండి తమ



స్వాధీనంలో ఉన్న భూమిని అధికారులు ఆన్ లైన్ చేయమంటే చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని.. దయ చేసి తమ భూమిని ఆన్ లైన్ చేసి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- నాలుగేళ్లుగా పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల అంతర్ జిల్లా



బదిలీలు కాకపోవడంతో సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని.. దయ చేసి సొంత జిల్లాలకు బదిలీ చేసి కుటుంబాలకు దగ్గర ఉండేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని పలువురు ఉపాధ్యాయులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- కడప జిల్లా డీఈఓ మీనాక్షి అసంబద్ధ, అనుచిత వైఖరికితో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆమె వైఖరిపై విచారించి చర్యలు తీసుకోవాలని కడప జిల్లా ఉపాధ్యా సంఘాల ఐక్యవేదిక సభ్యులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తనకు తన తాత నుండి వారసత్వంగా వచ్చిన భూమిని పక్కన ఉండే చావలి శివ, రామరాజులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని తనను ఇబ్బంది పెడుతున్నారని.. సర్వేయర్ తో తన భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని ఎన్టీఆర్ జిల్లా కె.వి కండ్రికకు చెందిన కందుల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.
- తన ఇంటి స్థలంలో ఉన్న కరెంట్ స్తంభాన్ని తొలగించి నిరుపేదైన తనను ఇల్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించాలని కడప జిల్లా చక్రాయపేట మండలం కె.రాజుపల్లె గ్రామానికి చెందిన బొమ్మే పల్లి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.



పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకు వారిలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీసేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆ తర్వాత వారికి ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమమే మెప్మా చేపట్టిన శిక్షణ కార్యక్రమాల ఉద్దేశం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మెప్మా, హెూం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్ - 1 మీటింగ్ శుక్రవారం దర్శి పట్టణం లోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు.



కాకినాడ జిల్లాకు చెందిన చరణ్, మణికంఠ ఏడీబీ రోడ్డులో ప్రమాదానికి గురై మరణించిన ప్రాంతం రంగంపేట మండలం ముకుందవరం గ్రామం వద్ద సంఘటన స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్



తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్యపుట్టిన రోజు జరుపుకున్న అల్లు అరవింద్



3వ డివిజన్‌లో 100 మంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందచేసిన విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమోహన్



ఒంగోలు నగరంలోని గోపాల్ నగర్‌లోని మొదటి లైన్‌లో ఉన్న పుట్టచెట్టు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గోపూజ కార్యక్రమాన్ని ఏపీటీడీసి చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఘనంగా నిర్వహించారు.

# రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్ఐ మృతి

**బాపట్ల:** రోడ్డు ప్రమాదంలో ఓ ఏఆర్ ఎస్ఐ మృతి చెందారు. చీరాలకు చెందిన మేడిద సంపూర్ణ బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బైకుపై బాపట్లకు బయల్దేరారు. మార్గమధ్య లో వెదుళ్లపల్లి చెక్ పోస్ట్ సమీపంలో వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో చనిపోయారు. ఆ కారు ప్రకాశం జిల్లాలో పనిచేసే అరుణ్ అనే మరో ఎస్ఐది అని ప్రాథమిక సమాచారం.

# త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యగణనకు శ్రీకారం

- జీవితకాలం ఉపయోగపడేలా స్కిల్ సెన్సస్ డాటా ఉండాలి
- మంగళగిరి అనుభవాలతో మరింత అర్థవంతంగా సేకరణ
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**అమరావతి, మహానాడు:** రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే స్కిల్ సెన్సస్ కి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టనున్న స్కిల్ సెన్సస్ విధివిధానాలపై స్కిల్ డెవలప్ మెంట్ శాఖ అధికారులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. మంగళగిరిలో చేపట్టిన నైపుణ్యగణన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని మరింత అర్థవంతంగా, సులభతరంగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెన్సస్ చేపట్టాలని అన్నారు. స్కిల్ సెన్సస్ ద్వారా సేకరించిన డాటా యువతకు జీవిత కాలం ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.

ఆర్గనైజ్డ్ సెక్టార్లతోపాటు అన్ ఆర్గనైజ్డ్ స్కిల్ డాటాను కూడా సేకరించాలని అన్నారు. స్కిల్డ్ వర్కర్లకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో తాము సొంత నిధులతో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తున్నామని, ఆ మోడల్ ను నమూనాగా తీసుకొని ఓం క్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేవలం అరబ్ దేశాల్లో మాత్రమే కాకుండా



యూరోపియన్, సౌత్ ఈస్ట్ ఏషియా దేశాల్లో స్కిల్డ్ వర్కర్లకు డిమాండ్ ఉందని, ఆయా దేశాల్లో అవసరాన్ని బట్టి స్థానికంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినట్లయితే సుమారు రెండు లక్షల మంది వరకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని అన్నారు.

ఇందుకోసం వివిధ ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు జర్మన్, జపనీస్ వంటి భాషలను కూడా నేర్పించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అంతర్జాతీయస్థాయి డిమాండ్ కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దాలన్నారు. స్కిల్ సెన్సస్ పూర్తయ్యాక యువతను వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ తీసుకునేలా చైతన్యపర్చాలని అన్నారు.

రాష్ట్రంలో అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని చేరుకోవడంతోపాటు పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే స్కిల్ సెన్సస్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. స్కిల్ సెన్సస్ డాటా సమీకృతం చేసే సమయంలో సీడాప్, ఏపీఎస్ఎస్డీసీ, నాప్ డాటా డబ్లింగ్ కాకుండా చూసుకోవాలని మంత్రి లోకేష్ అన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ మెంట్ ఎంపీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు నగరంలో శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు జి.టి.యస్ (గార్బేజ్ ట్రాన్స్ఫర్ సిస్టం)లు ఉపయోగపడతాయని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని నగర పాలక సంస్థ కంపోస్ట్ వద్ద రూ.6.60 కోట్లతో నిర్మించనున్న జి.టి.యస్ పనులకు ఎమ్మెల్యే మాధవితో కలిసి కమీషనర్ శంకుస్థాపన చేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 11, జనవరి 2025 ‖



## థ్రిల్లర్ మూవీ "హైడ్ న్ సీక్"



సహస్ర ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెంబర్ 1 గా తెరకెక్కిన హైడ్ న్ సీక్ సినిమా ఇటీవల థియేటర్స్ లో విడుదలై మంచి రివ్యూస్ తో పాజిటీవ్ టాక్ తో ప్రేక్షకాదరణ పొందింది, విశ్వంత్ హీరోగా, శిల్పా మంజునాథ్, రియా సచ్ దేవ ప్రధాన పాత్రలుగా తెరకెక్కిన ఈ సినిమా ద్వారా బసి రెడ్డి రానా దర్శకుడిగా పరిచయం అయ్యారు. నరేంద్ర బుచ్చి రెడ్డిగారి నిర్మించిన ఈ సినిమా ప్రస్తుతం ఆహా ఓటిటిలో స్ట్రీమింగ్ అవుతోంది. సాక్షి రంగారావు అబ్బాయి సాక్షి శివ, శ్రీధర్ రెడ్డి ముఖ్య పాత్రలు పోసించిన ఈ మూవీ సీట్ ఎడ్జ్ క్రైమ్ థ్రిల్లర్ గా దర్శకుడు బసిరెడ్డి రానా తెరకెక్కించారు, ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత నరేంద్ర బుచ్చి రెడ్డిగారి ఈ మూవీని నిర్మించారు. ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్స్ కు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. మొదటి సీన్ నుంచి సినిమా అయిపోయే వరకు ప్రేక్షకుడిని సీటులోంచి కదలనీయకుండా చేయడంలో దర్శకుడు మంచి సస్పెన్స్ మెయింటెన్ చేసాడు. ఆ మధ్య బ్లూవేల్ గేమ్ అని బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఒక గేమ్ పిల్లలనే కాదు యువకులను కూడా ఎలా బానిసలుగా చేసి వారి లైఫ్ లతో ఎలా ఆడుకుంటుందో కళ్లకు కట్టినట్లు చూపించారు. మొదటి మర్డర్ నుంచి విరామం వరకు స్క్రీన్ ప్లే ఎంతో గ్రిప్పింగ్ రాసుకున్నారు. తరువాత ఏం జరగబోతుందో ఎవరి ఊహలకు అందనంతగా చక్కగా తెరపై ప్రెజెంట్ చేశాడు దర్శకుడు. వరుస మర్డర్లు ఎందుకు జరగుతున్నాయి.

**విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విశేషాల్ని పంచుకున్నారు.**

## ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే మూవీ : అనిల్ రావిపూడి



**'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ సజెషన్ ఎవరిది? సంక్రాంతికి రేసులోకి రావడానికే ఈ టైటిల్ అనుకున్నారా?**

కథ అనుకున్నప్పుడు ఫెస్టివల్ ఫిల్మ్ అనుకోని స్టార్ట్ చేశాం. వెంకటేష్ తో చేసిన ఎఫ్2 పొంగల్ కి వచ్చి పెద్ద విజయం సాధించింది. ఎఫ్3 కూడా పొంగల్ కి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. ఈసారి చేసే సినిమా ఎలాగైనా పొంగల్ కి తీసుకొస్తే బావుటుందని సినిమా ఓపెనింగ్ అప్పుడే సంక్రాంతికి రావాలని అనుకున్నాం. కానీ అప్పుడు అనౌన్స్ చేయలేదు. ఈ కథ ఒక రేస్క్యు ఆపరేషన్ కి సంబధించింది. సెకండ్ హాఫ్ లో నాలుగు రోజులు జర్నీ సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం.

**మీరు చేసిన ప్రమోషన్స్ చాలా వైరల్ అయ్యాయి. సినిమా ప్రమోషన్స్‌లో చాలా యాక్టివ్ గా ఉండటానికి కారణం?**

కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి గొప్పగా తీయగానే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ వుండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తోచ్చు కోగాలమని నా అభిప్రాయం. ఈసారి సోషల్ మీడియాపై ఎక్కవ ఫోకస్ చేశాం. వెంకటేష్ లాంటి పెద్ద స్టార్ దిగి సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది.

**రమణగోగులతో పాడించాలనే ఆలోచన ఎవరిది ?**

భీమ్స్ ఇచ్చిన గోదారి గట్టు ట్యూన్ వినగానే ఒక పెక్యులర్ వాయిస్ తో పాడిస్తే బావుంటుదని అనుకుకొని రమణ గోగుల గారిని ఫస్ట్ ఆప్షన్ గా ఎంచుకున్నాం. భీమ్స్ ఆయన్ని సంప్రదించి పాడించారు. ఈ క్రెడిట్ భీమ్స్ కి దక్కుతుంది. రమణ గోగుల కూడా తన మార్క్ ని యాడ్ చేశారు. హిట్ సాంగ్ అనుకున్న పాట కాస్త గ్లోబల్ సాంగ్ అయ్యింది. 85 మిలియన్ వ్యూస్ ని క్రాస్ చేసింది.

**ఐశ్వర్య రాజేష్ ని ఆడిషన్ చేసి తీసుకోవడానికి కారణం?**

భాగ్యం క్యారెక్టర్ చాలా స్పెషల్. వెరీ ఎడ్జ్ లో నడిచేది. చాలా కేర్ తీసుకొని చేయాల్సిన క్యారెక్టర్. ఐశ్వర్య బెస్ట్ పెర్ఫార్మర్. అయితే తను గోదారి యాస ఎలా పలుకుతుంది ? ఆ క్యారెక్టర్ లో తన బాడీ లాంగ్వేజ్ ఎలా వుంటుందో తెలుసుకోవడానికి చిన్న ఆడిషన్ లా చేశాం. భాగ్యం చాలా మంచి క్యారెక్టర్. ఐశ్వర్యకి మంచి పేరు వస్తుంది. మీనాక్షి కూడా చాల క్రమశిక్షణ గల నటి. తనకి మంచి టైం సెన్స్ వుంది. చాలా చక్కగా పెర్ఫార్మ్ చేసింది. ఇద్దరూ ఆదరగొట్టారు.

**వెంకటేష్‌తో పాట పాడించాలనే ఆలోచన ఎవరిది ?**

వెంకటేష్ కి బ్లాక్ బస్టర్ పొంగల్ సాంగ్ చాలా నచ్చేసింది. ఆయనే స్వయంగా పాడతానని చెప్పారు. నేను షాక్ అయ్యాను. అదే టైమింగ్ లో ఓ రీల్ చేశాం. వెంకటేష్ 20 నిమిషాల్లో ఆ పాట పడేశారు. వెంకీ పాడిన తర్వాత భీమ్స్ కూడా షాక్ అయ్యాడు.



## 'ఒక పథకం ప్రకారం' ట్రైలర్ విడుదల

'143', 'బంపర్ ఆఫర్' లాంటి చిత్రాలతో ప్రామిసింగ్ హీరో అనిపించుకున్న సాయిరాం శంకర్ మరో విభిన్న చిత్రం 'ఒక పథకం ప్రకారం' . ఈ సినిమా ట్రైలర్ ని ఈ రోజు విడుదల చేశారు. "ఓ మంచివాడి లోపల ఒక చెడ్డవాడు ఉంటాడు, ఓ చెడ్డవాడి లోపల చెడ్డవాడు మాత్రమే ఉంటాడు" అనే వాయిస్ ఓవర్ తో మొదలవుతూ క్రైం, మర్డర్ కథనాలను చూపిస్తూ హీరోనే విలనా అనే సందేహంపై ముగించడం ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ ఈ చిత్రాన్ని తన వినోద్ విహాన్ ఫిల్మ్స్ బ్యానర్ తో పాటు గార్లపాటి రమేష్ విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై సంయుక్తంగా నిర్మించారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ, "ఇదొక విభిన్నమైన కథ. అడ్వకేట్ పాత్రలో సాయిరాం శంకర్, పోలీసు పాత్రలో సముద్రఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో ఉత్కరభరితంగా తీసుకెళ్ళే క్రైం, మిస్టరీ కథనాలతో ఆద్యంతం కట్టిపడేస్తుంది. రాహుల్ రాజ్, గోపి సుందర్ పాటలు - స్కోర్ అద్భుతంగా వచ్చాయి. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నాం" అన్నారు.



## అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ లాంచ్

ఐకానిక్ అన్నపూర్ణ స్టూడియోస్ సినిమా & హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ ప్రారంభించడం ద్వారా మళ్ళీ చరిత్ర సృష్టించింది, దీనిని దర్శకధీరుడు రాజమౌళి, అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మన్, అగ్ర హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో లాంచ్ చేశారు. డాల్బీతో కలిసి ప్రారంభించబడిన ఈ అత్యాధునిక సౌకర్యం, భారతీయ చలనచిత్ర నిర్మాణం ఆడియో-విజువల్ ప్రమాణాలను రీడిఫైన్ చేయడం, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సినిమా ఎక్స్ పీరియన్స్ అందించే లక్ష్యంగా పెట్టుకుంది. అకాడమీ అవార్డు గెలుచుకున్న రాజమౌళి త్రిపుల్ ఆర్-స్పెషల్ ఫుటేజ్ కూడా ఈ గ్రాండ్ ఈవెంట్‌లో ప్రదర్శించారు-డాల్బీ సినిమాలో విడుదలైన మొట్టమొదటి భారతీయ చిత్రం, ఇది భారతీయ చలనచిత్ర పరిశ్రమకు ఒక మైలురాయి క్షణంగా మారింది. దర్శక ధీదరుడు రాజమౌళి మాట్లాడుతూ... త్రిపుల్ ఆర్ సమయంలో, మేము సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు, మేము జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది.

మన దేశంలోనే డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్ పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. కానీ ఈరోజు, అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి నేను చాలా థ్రిల్ అయ్యాను. నా తదుపరి సినిమా విడుదలయ్యే సమయానికి, భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది అనేది మరింత గొప్ప విషయం. డాల్బీ విజన్‌లో సినిమా చూడటం పూర్తిగా భిన్నమైన అనుభవం - స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. ప్రేక్షకులు దానిని ఎక్స్ పీరియన్స్ చేయడం థ్రిల్లింగ్ గా వుంది'అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మన్ అగ్ర హీరో నాగార్జున అక్కినేని, భారతీయ సినిమా ఆవిష్కరణలలో స్టూడియో ఎలా ముందంజలో ఉందో చెప్పారు.



## 'బాపు' నుంచి రామ్ మిర్యాల సాంగ్

వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్ లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీ-డ్రామా 'బాపు'. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ బాపు మ్యూజికల్ జర్నీ కిక్ స్టార్ట్ చేశారు. యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ 'అల్లో నేరేడల్లో పిల్లా' సాంగ్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. 'అల్లో నేరేడల్లో పిల్లా' సాంగ్ కంపోజిషన్ బ్యూటీఫుల్ అండ్ క్యాచి గా వుంది. రామన్న వాయిస్ ఈ సాంగ్ కి పర్ఫెక్ట్. లిరిక్స్ బ్యూటీఫుల్ గా వున్నాయి. మణి లుక్ చాలా బావుంది. ఈ సినిమా మరో బలగం కావాలని కోరుకుంటు న్నాను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ధృవన్ ఈ పాటని సోల్ ఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సెన్సేషనల్ సింగర్ రామ్ మిర్యాల తన ఎనర్జిటిక్ వోకల్స్ తో కట్టిపడేశారు. రఘు రాం రాసిన లిరిక్స్ క్యాచిగా వున్నాయి.

## "ఏజెంట్ గై 001" ట్రైలర్ విడుదల



డేవిడ్ ఆండర్సన్ దర్శకత్వంలో ఎరిక్ ఆండర్సన్ నిర్మాతగా బాల్టాజర్ ప్లాటో, డేవిడ్ ఆండర్సన్ స్క్రీన్ ప్లే వహిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న హాలీవుడ్ డబ్బింగ్ చిత్రం ఏజెంట్ గై 001. ఈ చిత్రానికి ఆంటోన్ క్లాడ్ జంపర్ గెస్టిన్ సంగీతాన్ని అందించగా డెన్నిస్ ఆండర్సన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరించారు. ఆంటోన్ కార్ల్సన్ సినిమాటోగ్రాఫర్ గా పని చేశారు. బాల్టాజర్ ఫ్లోటో, ఆంటోనీ స్జోలండ్, మిల్టన్ బిజోర్నెగ్రెన్, నాట్ వెస్ట్ బ్యాక్, ఓమర్ మీర్జా కీలక పాత్రలో నటిస్తూ వస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో పి శ్రీనివాస గౌడ్ నిర్మిస్తూ సహాయ నిర్మాతగా పి హేమంత్ వ్యవహరిస్తూ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే ఇప్పటికే తెలుగులో విడుదలైన ఈ చిత్ర టీజర్ చూస్తుంటే జేమ్స్ బాండ్ చిత్రాల తరహాలో వస్తున్న మరొక అద్భుతమైన యాక్షన్ ఇంకా అడ్వెంచర్లు కలిగిన చిత్రంగా ఈ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. టీజర్ ను చూస్తే డబ్బు చుట్టూ తిరిగే ఒక పొలిటికల్ డ్రామాలా కనిపిస్తుంది. మేయర్ సీటు కోసం జరిగే ఫైట్స్ అలాగే కొన్ని అడ్వెంచర్లు ఉన్నట్లు అర్థమవుతుంది.

## గరివిడి లక్ష్మి నుండి 'నల జిలకర మొగ్గ'



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజి విశ్వ ప్రసాద్ మరియు టిజి కృతి ప్రసాద్ నిర్మించిన ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం గరివిడి లక్ష్మి. ఆమె శక్తివంతమైన నటనకు ప్రసిద్ధి చెందిన హీరోయిన్ ఆనంది మరో చిరస్మరణీయమైన పాత్రను అందించబోతున్నారు. ప్రశంసలు పొందిన నిర్మాతల నేతృత్వంలోని ప్రొడక్షన్ హౌస్, ఉత్తర ఆంధ్ర ప్రాంతంలోని ప్రతిష్టాత్మకమైన సంస్కృతిని ప్రతిచోటా ప్రేక్షకులకు అందించే జానపద కళాఖండం "నల జిలకర మొగ్గ" విడుదల చేసింది. నల జిలకర మొగ్గ, తరతరాలు ఇష్టపడే క్లాసిక్ జానపద గీతం, కవితా సౌందర్యం మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందింది. స్వచ్ఛత, సరళత మరియు దయకు ప్రతీకగా ఉండే సున్నితమైన "నల జిలకర మొగ్గ" (జీలకర్ర మొగ్గ)తో యువతి యొక్క గాంభీర్యాన్ని పాట అందంగా పోల్చింది. ఇది ఒక శక్తివంతమైన సందేశాన్ని అందిస్తుంది: స్త్రీ యొక్క సహజ ఆకర్షణ భౌతిక సంపద, నగలు లేదా అత్యంత విస్తృతమైన చీరలను కూడా మించిపోయింది. ప్రముఖ బుర్ర కథా కళాకారిణి గరివిడి లక్ష్మి యొక్క అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా ఈ పాట విస్తృతమైన ప్రశంసలను పొందింది. ఉత్తర ఆంధ్ర యొక్క జానపద సంప్రదాయాలను, ముఖ్యంగా 1990లలో సంరక్షించడంలో మరియు ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో ఆమె చేసిన విశేషమైన సహకారం, ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక చరిత్రలో ఆమెకు శాశ్వతమైన స్థానాన్ని సంపాదించిపెట్టింది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144